గురువారం
15-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి: 71, సంచిక: 85
పేజీలు: 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం: 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడమే లక్ష్యం: జిన్‌పింగ్

ఉజ్బెకిస్తాన్‌లోని సమర్కండ్ నగరంలో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు హాజరుకానున్నారు. దాదాపు 1,000 రోజులలో తన మొదటి విదేశీ పర్యటనలో భాగంగా జిన్‌పింగ్ మధ్య ఆసియాకు చేరుకున్నారు. 2019జూన్ తర్వాత మొదటిసారిగా జరుగుతున్న ఈ సదస్సుకు సభ్య దేశాల అధినేతలందరూ హాజరవుతున్నారు.

2లో

'రాఫెల్' విచారణకు
ఆటంకాలు

భారత్-ఫ్రాన్స్ దేశాల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం 36 రాఫెల్ యుద్ధ విమానాలను ఆ దేశం భారత్‌కు విక్రయించడంపై వివాదం నెలకొంది. దీంతో కోర్టు విచారణ క్రమంలో ఇద్దరు ఫ్రెంచ్ న్యాయమూర్తులకు సైనిక రహస్యం ఆటంకంగా మారింది.

5లో

నేటి నుంచి అసెంబ్లీ

- ఐదు రోజులపాటు జరిగే అవకాశం
- అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్న అధికార, ప్రతిపక్షం
- తొలిరోజే మూడు రాజధానులపై లఘు చర్చకు వైసీపీ సన్నాహం

విశాలాంధ్ర బ్యూరో అమరావతి:
రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు సమావేశాలు నిర్వహించాలని అధికార పార్టీ భావిస్తున్నప్పటికీ, తొలిరోజు జరిగే శాసన సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) భేటీలో సమావేశాలు కచ్చితంగా ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం వెలువడనుంది. గురువారం ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభం కానుండగా, 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. ఇక ఈ సమావేశాల్లో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రజలకు తెలియజేసేందుకు వ్యూహ రచన చేస్తుండగా, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రతిపక్ష టీడీపీ సన్నద్ధమవుతోంది. ఈ సమావేశాల్లో కొన్ని కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కూడా అధికారపార్టీ సన్నాహం చేస్తోంది. ముఖ్యంగా అమరావతి ఉద్యమం 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రాజధాని రైతులు 'అమరావతి-అరసవిల్లి' మహా పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర మూడో రోజుకి చేరింది. వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు మహా పాదయాత్రకు సంఘీభావం తెలపడంతో పాటు

- మిగతా 2 లో

కొత్తపల్లి గీతకు
ఐదేళ్ల జైలు

భర్త, మరో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులకూ శిక్ష

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:
కంపెనీల పేరిట భారీగా రుణాలు పొంది తిరిగి చెల్లించకుండా బ్యాంకులకు పంగనామం పెట్టిన బీజేపీ నేత, మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు నాంపల్లి సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా విధింధించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో గీతతోపాటు ఆమె భర్త రామకోటేశ్వరరావుకు కూడా ఇదే శిక్ష విధించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో కొత్తపల్లి గీత, ఆమె భర్త, ఇద్దరు బ్యాంకు ఉద్యోగులపై 2015లో చార్జిషీటు దాఖలైంది. దీని ఆధారంగా కోర్టు తీర్పు వెల్లడించింది. బ్యాంక్ అధికారులు బీకే జయప్రకాశన్, కేకే అరవిందాక్షన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి రూ.2లక్షల జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

తీర్పు వెలువడిన వెంటనే కొత్తపల్లి గీత సహా మిగిలిన నిందితులను అరెస్టు చేసి వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా కొత్తపల్లి గీత తరపున హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలైంది. దీనికి సంబంధించి కోర్టు విచారిస్తుందా? లేక వాయిదా వేస్తుందా? అన్నది తెలియాల్సి ఉంది. 2015లో కేసు నమోదైంది. సుదీర్ఘకాలం విచారణ జరిగింది. విశ్వేశ్వర ఇన్‌ఫ్రా పేరుతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.52కోట్ల రుణం తీసుకొని తిరిగి చెల్లించక పోవడంతో బ్యాంక్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్‌లో కొత్తపల్లి గీత దంపతులను పోలీసులు అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

2014 ఎన్నికల్లో వైసీపీ అరకు ఎంపీగా ఆమె గెలుపొందారు. కొన్ని నెలల తర్వాత పార్టీని వీడారు. 2018లో జన జాగృతి పార్టీ స్థాపించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తన పార్టీ పేరుతో అరకు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2020లో తన పార్టీని బీజేపీలో విలీనం చేశారు.

అనూహ్య స్పందన

తెనాలిలో పాదయాత్రకు పోలీసుల ఆటంకం

- వెనక్కి తగ్గని రైతులు
- పార్టీలు, ప్రముఖుల సంఘీభావం
- విరాళాల వెల్లువ

విశాలాంధ్ర-తెనాలి:
రాజధాని అమరావతి కోసం రైతులు చేపట్టిన మహాపాదయాత్రకు గుంటూరు జిల్లా తెనాలిలో ఆటంకం ఎదురైంది. తెనాలిలోని ఐతానగర్ వైపు పాదయాత్ర వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, పాదయాత్రీకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాష్ట్రానికి రాజధానిగా అమరావతే కొనసాగాలని, తమ ఆకాంక్షకు విఘాతం కలగకూడదనే దృఢ సంకల్పంతో రాజధానికి వేలాది ఎకరాల భూములిచ్చిన రైతులు అమరావతి నుండి అరసవల్లికి చేపట్టిన మహాపాదయాత్రకు మూడోరోజు బుధవారం తెనాలి

- మిగతా 2 లో

రాజధాని అసైన్డ్ భూముల కేసులో మాజీ మంత్రి నారాయణకు
ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
మాజీ మంత్రి పి.నారాయణకు హైకోర్టులో ఊరట లభించింది. రాజధాని అమరావతిలో అసైన్డ్ భూముల కొనుగోళ్ల కేసులో ఆయనకు రాష్ట్ర ఉన్నతన్యాయస్థానం మూడు నెలల ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అమరావతి రాజధాని ప్రాంతంలో మొత్తం 1100 ఎకరాల అసైన్డ్ భూముల వ్యవహారంలో 169.27 ఎకరాలకు సంబంధించి అక్రమాలు జరిగాయన్న అభియోగంపై సీఐడీ దర్యాప్తు చేపట్టింది. అనంతవరం, కృష్ణాయపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నవులూరు, రాయపూడి తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం గ్రామాల్లో వేర్వేరు సర్వే నెంబర్లలో సుమారు

- మిగతా 2 లో

ఎమ్మెల్యే @ రూ.25 కోట్లు

- బీజేపీతో ప్రజాస్వామ్యం ఖూనీ
- రాష్ట్ర ప్రభుత్వాల కూల్చివేతకు కుట్రలు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ:
బీజేపీపై ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడానికి బీజేపీ శక్తివంచన లేకుండా కుట్రలు చేస్తోందని విమర్శించారు. పంజాబ్‌లో తమ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేల కొనుగోలుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందుకోసం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.25 కోట్లు ఇస్తానని ఆశ చూపిస్తోందని మండిపడ్డారు. 'ఒక్కో ఎమ్మెల్యేకు రూ.25 కోట్లు ఇవ్వడం ద్వారా పంజాబ్‌లో మా శాసనసభ్యులను కొనుగోలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు మంగళవారం మాకు తెలిసింది. ఆ పదిమంది ఎమ్మెల్యేలు నన్ను సంప్రదించారు. వారంతా బుధవారం పంజాబ్‌లో విలేకరుల సమావేశంలో బీజేపీ కుట్రలను బహిర్గతం చేస్తారు' అని కేజ్రీవాల్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం...ప్రభుత్వాలను కూల్చడం. ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ప్రతిరాష్ట్రంలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా ఆపరేషన్ లోటస్‌ను బీజేపీ విజయవంతంగా ముందుకు తీసుకెళుతోందని మండిపడ్డారు. అటు డబ్బులు ఆశ చూపడమా లేదా సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలతో బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతోందని కేజ్రీవాల్ తెలిపారు. చట్టసభ సభ్యుల కొనుగోలుకు బీజేపీ ప్రజాధనాన్ని ఉపయోగిస్తోందని, దీనివల్ల దేశంలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోందని విమర్శించారు. మరోవైపు, కాంగ్రెస్ తీరును కూడా కేజ్రీవాల్ ఎండగట్టారు. గోవాలో 8మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారని, ఫిరాయింపుల నుంచి తమ ఎమ్మెల్యేలను

- మిగతా 2 లో

ఎన్నికల్లో ఓట్ల కోసం సామాజిక సామరస్యత విచ్ఛిన్నం

- ఎనిమిదేళ్లుగా కొద్దిమందే వద్దే అధికారం కేంద్రీకృతం
- నిరంకుశ పోకడలు... రాజ్యాంగంపై దాడి
- పార్లమెంటును పని చేయనివ్వడం లేదు
- ఎన్నడూ లేనంత అసమానతలు
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సోనియా విమర్శలు

న్యూఢిల్లీ:
మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ బుధవారం తీవ్రస్థాయిలో విమర్శల దాడి చేశారు. గత ఎనిమిదేళ్లుగా కొద్దిమంది రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తల వద్దే అధికారం కేంద్రీకృతమైందని, ఇది భారతదేశ ప్రజాస్వామ్యాన్ని, సంస్థలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ విలువలు,

- మిగతా 2 లో

గోవాలో ఆపరేషన్ కమలం

- బీజేపీలోకి మాజీ సీఎం సహా ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- ఇది 'ఆపరేషన్ కీచడ్' : కాంగ్రెస్ విమర్శ

పనాజీ:
గోవాలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన మాజీ ముఖ్యమంత్రి సహా 8 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ సమక్షంలో వారంతా కాషాయ కండువాలు కప్పుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు లేని సమయంలో బుధవారం ఉదయం వారంతా స్పీకర్‌ను కలవడంతో ఊహాగానాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ నాయకులు తమ పార్టీలో చేరుతున్నారంటూ తర్వాత బీజేపీ గోవా అధ్యక్షుడు సదానంద్ షెట్ తనవడే మీడియాకు తెలిపారు. ఈ ప్రకటన వెలువడిన కాసేపటికే అగ్ర నేతలు దిగంబర్ కామత్, మైఖేల్ లోబో నేతృత్వంలోని 11 మంది ఎమ్మెల్యేలలో ఎనిమిది మంది అధికార బీజేపీలో చేరారు. దీంతో 40 మంది సభ్యులు ఉన్న సభలో ప్రతిపక్ష పార్టీకి కేవలం ముగ్గురు సభ్యులే మిగిలారు. రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' కొనసాగుతున్న సమయంలో చోటుచేసుకున్న ఈ పరిణామం ఆ పార్టీకి చాలా ఇబ్బందికరంగా మారింది. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఒక గ్రూపుగా విడిపోవడంతో, అంటే పార్టీ బలంలో మూడింట రెండు వంతులు. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం వారిని అనర్హులుగా ప్రకటించలేరు. వీరిలో మైఖేల్ లోబో భార్య డెలిలా లోబో, రాజేష్ ఫాల్దేశాయ్, కేదార్ నాయక్, సంకల్ప్ అమోంకర్, అలిక్సో సిక్వేరా, రుడాల్ఫ్ ఫెర్నాండెజ్ ఉన్నారు. 'ఇది కాంగ్రెస్ చోరో (కాంగ్రెస్‌ను విడిచిపెట్టండి), బీజేపీ కో జోడో' అని మైఖేల్ లోబో చమత్కరించారు. జులైలో కూడా దిగంబర్ కామత్, మైఖేల్ లోబో పార్టీ మారతారన్న ఊహాగానాలకు కేంద్రంగా ఉన్నారు. దీంతో ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని కాంగ్రెస్ స్పీకర్‌ను కోరింది. పార్టీ ప్రతిపక్ష నాయకుడిగా మైఖేల్ లోబోను తొలగించింది. కానీ ఆ స్థానాన్ని ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. జులైలో మాజీ ముఖ్యమంత్రి కామత్ మాట్లాడుతూ విభజనకు నాయకత్వం వహిస్తున్నారనే

- మిగతా 2 లో

ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం

రెండో ప్రమాద హెచ్చరిక

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం:
ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద వరద ప్రవాహం భారీగా పెరుగుతుండటంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం నీటిమట్టం 14.20 అడుగులకు చేరగా, 13.37లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి కాల్వలకు 8వేల800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాలర్లు వేటకు వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే అనేక లంక గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయి. ఎగువన గోదావరి వరదతో గౌతమి, వశిష్ట, వైనతేయ నదులు ఉధృతంగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!



సార్సార్ ఒక తువ్వాలు పంపిస్తాను మీ పార్టీలో వేసి ఉంచండి, ఇక్కడి పరిస్థితిలేం బాలేవు!

ఇసుక అక్రమ రవాణా నివారణకు

దిద్దుబాటు చర్యలు



- 'విశాలాంధ్ర' కథనానికి స్పందించిన ప్రభుత్వం
- అక్రమార్కులపై కేసులకు జేపీవీఎల్ ఫిర్యాదు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర-డిజిటల్: ఇసుక అక్రమ రవాణా నివారణకు ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 'ఇసుక రీచ్‌ల్లో బకెట్ మాయ' అన్న శీర్షికతో ఆగస్టు 16న విశాలాంధ్రలో ప్రచురితమైన కథనానికి స్పందించింది. అందులో భాగంగానే కాంట్రాక్ట్ సంస్థ అయిన మెస్సర్స్ జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ (జేపీవీఎల్) మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, కర్నూలు, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసింది. తమ పేరుతో ఎవరైనా ఇసుక అక్రమ దందాకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ కోరింది. ఇసుక తవ్వకాలకూ, విక్రయాలకూ తమకే పూర్తి హక్కులు ఉన్నాయని, తమ పేరు చెప్పుకుని కొందరు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వస్తున్న వార్తలను ఖండిస్తున్నట్టు ఆ ఫిర్యాదులో పేర్కొంది. తాము ఎవరికీ సబ్ కాంట్రాక్ట్ ఇవ్వలేదని, ఇతరుల పేరుమీద ఇసుక లావాదేవీలకు అనుమతి ఇవ్వలేదని ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడినా, అమ్మకాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జేపీవీఎల్ సంస్థ తెలిపింది. జిల్లాల వారీగా తాము సబ్ కాంట్రాక్ట్ ఇచ్చామంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేసింది. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ఏపీ ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఏర్పాటు చేసింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసు

ఇదిలా ఉండగా, ఏపీలో అన్ని చెక్‌పోస్టుల వద్ద నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామనీ, పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఇసుక అక్రమ నివారణకు ఎస్ఈబీ అధికారులు టోల్‌ఫ్రీ నెంబర్ 14500ను ఏర్పాటు చేశారనీ, సమాచారాన్ని ఎవరైనా నిర్భయంగా ఫోన్ ద్వారా తెలియజేయవచ్చనీ, వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. డయల్ 100కు గానీ, వాట్సప్ నెంబర్ 7777877722కు గానీ సమాచారం అందించవచ్చన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

51 మంది హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

విశాలాంధ్ర-పరవాడ(విశాఖ జిల్లా): విశాఖ జిల్లా పరవాడ మండలంలోని తానాం బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులు 51 మంది బుధవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, వికారం, కడుపునొప్పితో బాధపడ్డారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి స్పందించి పరవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సమాచారమందించారు. దీంతో పరవాడ పీహెచ్‌సీ కార్యక్రమాల అధికారి డాక్టర్ కిశోర్ కుమార్ తానాం హాస్టల్‌ను సందర్శించారు. తక్షణమే వైద్య సిబ్బంది చేరుకొని ప్రాథమిక చికిత్స అందించారు. దీంతో విద్యార్థులు కోలుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఉదయం అల్పాహారంలో కొబ్బరి చట్నీ తీసుకోవడంతో విద్యార్థులు వాంతులు, కడుపు నొప్పికి గురైనట్లు గుర్తించారు. వైద్య సహాయం కోసం ఆరోగ్య సిబ్బందిని మూడు జట్లుగా విభజించి 24 గంటల సేవల కోసం నియమించారు. పరవాడ తహసీల్దార్ ప్రకాశరావు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. అటు రెవెన్యూ, ఇటు వైద్య ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు భరోసా ఇవ్వడంతో మధ్యాహ్నం పెరుగుతో భోజనం చేశారు.

సీఎస్‌ఈ'కే డిమాండు

- మెకానికల్, సివిల్‌పై అనాసక్తి
- ఏపీ ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్లు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్-2022 ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్లు ప్రారంభమయ్యాయి. ముందుగానే ఊహించినట్టు చాలా మంది అభ్యర్థులు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) ఆప్షన్లనే అత్యధికంగా నమోదు చేసుకున్నట్లు తెలిసింది. పేరొందిన కళాశాలు మొదలు ఆ కోర్సును అందిస్తున్న కాలేజీల వైపు మొగ్గు చూపారు. సీఈఎస్‌ఈ, సీఎస్‌సీకి అనుబంధంగా వచ్చిన వివిధ కంప్యూటర్ కోర్సుల ఆప్షన్లపైనే ఆసక్తి కనపర్చారు. ఈనెల 13వ తేదీ ఉదయం నుంచి 17 వరకు అనుకున్న ప్రణాళిక ప్రకారం వెబ్ ఆప్షన్లు ప్రారంభంకాకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. అయితే 13న రాత్రి 11.30 తర్వాత వెబ్ ఆప్షన్లు అందుబాటులో ఉంచారు. తొలి రోజు కంటే, మరుసటి రోజు మరికొన్ని ఇంజినీరింగ్ కళాశాలలు, కోర్సులకు అనుమతిచ్చారు. అన్ని కళాశాలల్లో కలిపి దాదాపు 1557 బ్రాంచీలను అభ్యర్థులు ఎంచుకునేలా సౌకర్యాలు చేపట్టారు. విద్యార్థులు వరుస వారీగా సీఎస్‌ఈనే ఎంచుకోవడంతో, ఆయా కోర్సులకు మరింత డిమాండు పెరిగింది. ఇప్పటికే సీఎస్‌ఈ సీట్లు సాధించేందుకు సరిపడా ర్యాంకులు రాని వారంతా, యాజమాన్య కోటాలో సీట్లను కొనుగోలు చేసి, ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. సీఎస్‌ఈ రాదని తెలిసిన వారంతా, పక్క రాష్ట్రాలలో ప్రైవేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందారు. సీఎస్‌ఈ తర్వాత ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) కోసం కొందరు ఆప్షన్లు పెట్టుకున్నారు. సివిల్, మెకానికల్‌పై ఎవ్వరూ ఎక్కువగా దృష్టి కేంద్రీకరించడం లేదు. సీఎస్‌ఈకి సంబంధించి అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ సీట్లు పెంచినా ఇంకా డిమాండు పెరిగింది. ఈనెల 18వ తేదీన వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశమిచ్చారు. కన్వీనర్ కోటాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల సీట్ల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలో కౌన్సెలింగ్ జాప్యం కారణంగా ఇప్పటికే చాలా మంది ఇతర రాష్ట్రాలను ఆశ్రయించారు. ఈ ఏడాది అందుబాటులో ఉన్న ఇంజినీరింగ్ సీట్ల కంటే, విద్యార్థులు అత్యధిక సంఖ్యలో అర్హత సాధించారు. దీంతో అందరికీ సీటు వస్తుందా? ఈ ఏడాది కూడా సీట్లు మిగిలిపోతాయా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

పటిష్ఠ చర్యలు తీసుకోండి

అధికారులకు కొయ్యే మోషేనురాజు, తమ్మినేని సీతారామ్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న శాసనమండలి, శాసనసభ సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, స్పీకర్ తమ్మినేని సీతారామ్ అన్ని శాఖల కార్యదర్శులను, పోలీస్ అధికారులను కోరారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ కమిటీ హాలులో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులతో బుధవారం వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో వారిద్దరు పాల్గొన్నారు. సభ్యుల ప్రశ్నలకు సకాలంలో సరైన సమాధానాలు అందజేయడం, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. గత సమావేశాల్లో, ప్రస్తుతం సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానాలను సకాలంలో అందజేయాలని అన్ని శాఖల కార్యదర్శులను కోరారు. సమావేశాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. కొయ్యే మోషేనురాజు మాట్లాడుతూ సభ్యులు అడిగే ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు అందజేయడం ద్వారా సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలలో కొన్నింటికి ఇంకా సమాధానాలు రాలేదని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్సీల వైద్య బిల్లుల చెల్లింపుపై ఆర్థికశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడే మాజీ సభ్యులకు ఇళ్ల వద్దనే ఔషధాలు అందజేయాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. పోలీస్ అధికారులతో శాంతిభద్రతల అంశాన్ని సమీక్షించారు. ఇందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని కోరారు. తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ ప్రజల దృష్టి అసెంబ్లీ సమావేశాలపై కేంద్రీకృతమవుతాయని, ఈ సమావేశాలకు ఎంతో ప్రత్యేకత ఉందని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, శాసనసభ్యులు, మండలి సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. సమావేశంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద రాజు, చీఫ్ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి పి.బాలకృష్ణమాచార్యులు, మండలి ఓఎస్డీ కె.సత్యనారాయణరావు సహా వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఉన్నతాధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తుపై సీబీఐ బెంబేలు: టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో కేసుల దర్యాప్తునకు సీబీఐ బెంబేలెత్తుతోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. బుధవారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. గతంలో సీబీఐకి స్థానిక పోలీసులు భయపడే వారనీ, ఇవాళ వారికి సీబీఐ భయపడుతోందని ఎద్దేవా చేశారు. జగన్ అధికారంలోకి రాక ముందు వరకు, నాలుగు దశాబ్దాల కాలంలో సీబీఐ కేసు దర్యాప్తు చేస్తే... స్థానిక పోలీసు వ్యవస్థ భయపడే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ఈయన అధికారంలోకి వచ్చాక కేసుల దర్యాప్తుపై సీబీఐ భయపడుతోందని దుయ్యబట్టారు. వివేకా హత్య కేసు వెనుక సూత్రధారులు ఎవరో సీబీఐకి తెలిసినప్పటికీ ఏమీ చేయలేని స్థితిలో ఉందని విమర్శించారు. సామాన్యుడికి న్యాయం జరిగే పరిస్థితి రాష్ట్రంలో ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న)ను హైదరాబాద్‌లో పరామర్శిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.చంద్రా నాయక్, చిన్నం పెంచలయ్య.

ఉద్యోగాల భర్తీ కోసం నేడు చలో అసెంబ్లీ

ఏపీ టీఎన్ఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ శాఖల్లో రెండు లక్షల 30 వేల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తానని నిరుద్యోగులకు హామీ ఇచ్చి మోసం చేసినందుకు నిరసనగా గురువారం చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు ఏపీ టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న విషయంపై సీఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు. గ్రూప్-1, 2, ఎస్ఐ, కానిస్టేబుల్ నియామకాల కోసం నిరుద్యోగులు ఎంతగానో ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ అని నిరుద్యోగులను నిలువునా ముంచారని మండిపడ్డారు. పాదయాత్రలో ఇచ్చిన మోసపూరిత హామీలను విస్మరించినందుకే నిరుద్యోగులతో చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నామని పునరుద్ఘాటించారు. చలో అసెంబ్లీకి నిరుద్యోగులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తారా? లేక గద్దె దిగిపోతారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీని జగన్ జేబు సంస్థగా, రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వం, పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా చలో అసెంబ్లీ నిర్వహిస్తామని స్పష్టంచేశారు.

కొత్తగా 4వేల డిజిటల్ లైబ్రరీలు

- ప్రతి సచివాలయానికీ అనుసంధానం
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- జిల్లా గ్రంథాలయాల చైర్మన్లతో భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రంథాలయాల పూర్వవైభవానికి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లు పూర్తి అంకిత భావంతో పనిచేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్లు, కార్యదర్శులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి బొత్స మాట్లాడుతూ, చైర్మన్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రంథాలయాల బాధ్యత తనదని పనిచేస్తే ఫలితాలు వస్తాయని ఉద్బోధించారు. గ్రంథాలయాలను అభివృద్ధి చేయడంతోపాటు, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో సీఎం జగన్ ఉన్నారన్నారు. ఈ దిశలో చైర్మన్లందరూ పనిచేయాలని, విద్యార్థులకు అందుబాటులో ఉండేలా వాటి రూపురేఖలు మార్చాలన్నారు. త్వరలో దాదాపు 4 వేల డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ప్రతి గ్రామ/వార్డు సచివాలయానికి అనుసంధానంగా ఒక గ్రంథాలయం ఉండాలనేదీ సీఎం ఆలోచనని, దానికి తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని కోరారు. గ్రంథాలయాల చైర్మన్ పదవిని రాజకీయ పునరావాసంగా కాకుండా, ఒక మంచి అవకాశంగా మలచుకుని పనిచేస్తే చైర్మన్లకు మంచి పేరు వస్తుందన్నారు. గ్రంథాలయాల ఉన్నతీకరణతోపాటు, మరమ్మతులు తదితర అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని, చైర్మన్లు, కార్యదర్శులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజల్లో ప్రధానంగా విద్యార్థుల్లో చదివే జిజ్ఞాస పెరిగేలా గ్రంథాలయాల చైర్మన్లు చొరవ చూపాలన్నారు. పిల్లలు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా చూడటంలో గ్రంథాలయాలు తొలి సాధనం కావాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.శేషగిరిరావు, సంచాలకులు ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

విద్య, పరిశోధనా రంగాలలో ప్రోత్సాహం

ఐఓసీఎల్‌తో ఏయూ అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-విశాఖసిటీ: విద్య, పరిశోధన రంగాలలో ప్రోత్సాహం అందించే విధంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)-ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్, ఐఓసీఎల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రామకుమార్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ డీపీఐఐటీ ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఐఓసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్ కపూర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్య, పరిశోధన రంగాలలో ప్రోత్సాహం అందించే విధంగా ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. సీఏఆర్, యూజీసీ- జేఆర్ఎఫ్-నెట్, గేట్ అర్హత సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు పీహెచ్‌డీ, ఎంటెక్ పూర్తిచేసే ప్రక్రియలో భాగంగా తమ ప్రాజెక్టు వర్క్ పరిశోధనలు ఐఓసిఎల్‌తో కలిసి చేసే అవకాశం కల్పిస్తారు. అవసరాలకు అనుగుణంగా వీరు ఏయూలో, ఐఓసిఎల్ లో సంయుక్తంగా పనిచేసే వెసులుబాటు కల్పిస్తారు. వీరికి ఫెలోషిప్‌లను కూడా అందించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఐఓసిఎల్ డైరెక్టర్ రామకుమార్ మాట్లాడుతూ ఇంధన రంగంలో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లకు పరిష్కారం చూపే దిశగా ఆచార్యులు, పరిశోధకులు పరిశోధనలు జరపాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రత్యేకంగా ఇంధన రంగ సమస్యలపై మల్టీ డిసిప్లీనరీ రీసెర్చ్ నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కలిగిన ఐఓసీఎల్‌తో అవగాహన ఒప్పందం చేసుకోవడం, ఏయూ విద్యార్థులకు పరిశోధన, ఫెలోషిప్‌లు అందించే అవకాశాన్ని కల్పించడం పట్ల ఐఓసీఎల్ అధికారులకు ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమల అవసరాలను అవసరమైన విలువైన మానవ వనరులను తీర్చిదిద్దే బాధ్యతను ఏయూ సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు.

యువతకు ఆదర్శం 'జాహ్నవి'

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యువతకు ఆదర్శంగా జాహ్నవి ప్రతిభ నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ కొనియాడారు. మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో బుధవారం పాలకొల్లుకు చెందిన జాహ్నవి దంగేటి కుటుంబ సభ్యులు ఆమెను కలిశారు. నాసా ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్‌లో పాల్గొని చరిత్ర సృష్టించిన మొదటి భారతీయురాలిగా 19ఏళ్ల జాహ్నవి గుర్తింపు తెచ్చుకున్న విషయం విదితమే. గతంలో విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో వాసిరెడ్డి పద్మను జాహ్నవి కలిసి... తన ఆస్ట్రోనాట్ పైలెట్ కల గురించి వివరిస్తూ అప్పట్లో వినతిపత్రం అందించగా, దానిపై మహిళా కమిషన్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఆ తర్వాత సీఎం జగన్ రాజమహేంద్రవరం పర్యటన సందర్భంలో జాహ్నవి కలవడం... ప్రభుత్వం నుంచి ఆమెకు రూ.50లక్షల సాయం అందజేయడంపై వాసిరెడ్డి పద్మ సంతోషం వ్యక్తం చేశారు. జాహ్నవిని ఆమె దుశ్శాలువాతో సత్కరించి గౌతమ బుద్ధుని ప్రతిమను బహూకరించారు. పైలెట్ ఆస్ట్రోనాట్ అవ్వాలనే జాహ్నవి కోరికను నిజం చేసేందుకు శిక్షణకయ్యే ఖర్చుపై సాక్షాత్తూ సీఎం జగన్ పూనుకోవడం గొప్ప విషయంగా వాసిరెడ్డి పద్మ చెప్పారు. కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్ మాదిరి అంతరిక్షంలోకి ప్రవేశించాలనే లక్ష్యాన్ని జాహ్నవి త్వరలోనే ఛేదిస్తుందని ఆమె ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన యువతకు జాహ్నవి ఆదర్శమని, యువత, మహిళల సంకల్పశక్తికి 'మహిళా కమిషన్' ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

అమరావతి రైతుల పాదయాత్రను అడ్డుకోవడమంటే...

వరద ప్రవాహాన్ని చేతులతో ఆపడమే!

బహుజన జేఏసీ అధ్యక్షుడు బాలకోటయ్య

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజధాని రైతులు అమరావతి టు అరసవిల్లి వరకు నిర్వహిస్తున్న పాదయాత్రను ప్రభుత్వం అడ్డుకోవటం సరికాదని, అడ్డుకోవాలన్న ప్రయత్నిస్తే అది... వరద ప్రవాహానికి చేతులు అడ్డుపెట్టినట్లే అవుతుందని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య అభివర్ణించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... గుంటూరు జిల్లా తెనాలిలోని ఐతానగర్ మీదుగా పాదయాత్రను సాగనివ్వరాదని స్థానిక ఎమ్మెల్యే పోలీసులకు ఆదేశాలు ఇచ్చారని, కృతజ్ఞతా భావంతో పోలీసులు పాదయాత్రకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించారని చెప్పారు. ఇలాంటి స్వామి భక్తి కార్యక్రమాలకు స్వస్తి పలికి, న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను పోలీసులు పాటించాలని సూచించారు. ప్రతిపక్ష హోదాలో జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రకు అప్పటి ప్రభుత్వం ఎలాంటి ఆటంకం కలిగించకుండా ఎలా సహకరించిందో, అదే తీరుగా వైసీపీ ప్రభుత్వం కూడా రైతులు చేపట్టిన పాదయాత్రకు సహకరించాలన్నారు. పాదయాత్రపై మంత్రులు ఎంత పరుషంగా, నీచపు మాటలతో దాడి చేస్తే, వారికి అంత నష్టమని స్పష్టం చేశారు. మంత్రులు ముందు చూపుతో మాట్లాడితే మంచిదని హితవు పలికారు.

పారిశ్రామికాభివృద్ధికి సంపూర్ణ సహకారం

వైవీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సుందర విశాఖ నగరాన్ని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఉమ్మడి విశాఖ జిల్లాల వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. కంకటాల మల్లిక్ నేతృత్వంలో విశాఖ పారిశ్రామికవేత్తల ఆత్మీయ కలయిక నగరంలోని ఓ హోటల్లో బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారెడ్డి మాట్లాడారు. విశాఖకు పరిపాలన రాజధాని వస్తున్న సందర్భంలో నగరానికి మరిన్ని హంగులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. విశాఖ బీచ్‌ను ముంబై తరహాలో తీర్చిదిద్దుతామని, భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి కావలసిన ఎన్ఓసీ వచ్చిందని, దసరాకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఎయిర్ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని సుబ్బారెడ్డి తెలిపారు. నగరాన్ని మరింత ప్రశాంతంగా ఉంచడంతో పాటు అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. విశాఖను పరిపాలన రాజధాని చేయడంపై ఇక్కడి ప్రజల్లో కొన్ని అపోహలు ఉన్నాయని వాటిని తొలగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ విశాఖపట్నం భవిష్యత్తు అవసరాలు, అభివృద్ధి కోసం పారిశ్రామికవేత్తల నుంచి సూచనలు సలహాలు తీసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు 12 ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీయడానికి కొంతమంది చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు నమ్మొద్దని కోరారు. ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఇదే సమయంలో నగరంలో ఉన్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సంబంధించి ఒక కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. సీఐఐ చైర్మన్ నీరజ్ చాక మాట్లాడుతూ విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలో ఉన్న ఇండస్ట్రియల్ క్లస్టర్లకు భారీ వాహనాలు నిరంతరం తిరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటీ ఇండస్ట్రీస్ సంఘం ప్రతినిధి శివకుమార్ మాట్లాడుతూ ఐటీ పరిశ్రమలకు కావలసిన ఉద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చే బాధ్యతను తమకు అప్పగించాలని కోరారు. రాంకీ ఫార్మాకు చెందిన లాల్ కృష్ణ మాట్లాడుతూ కెమికల్ పార్కులో ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన భూమిని కేటాయిస్తే పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేందుకు అవకాశముందన్నారు. క్రెడాయ్ సౌత్ జోన్ సెక్రటరీ ధర్మేంద్ర మాట్లాడుతూ భవన నిర్మాణాలకు కావాల్సిన అనుమతులు త్వరితగతిన రావడంలేదని, అలాగే బహుళ అంతస్తుల నిర్మాణానికి ఏవియేషన్ డిపార్ట్‌మెంట్ అనుమతులు ఇవ్వడం లేదని చెప్పారు. శ్రావణి షిప్పింగ్ సంస్థ అధినేత సాంబశివరావు మాట్లాడుతూ ట్రక్కు, ప్రైవేట్ బస్సుల పార్కింగ్ ఏరియా లను ఏర్పాటు చేయాలని సూచించారు. దసపల్లా హోటల్ ఎండీ వెంకట్ మాట్లాడుతూ పర్యాటక ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉమెన్స్ వింగ్ నుంచి లీలా మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకించి ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, జీ మాధవి, భరత్ కుమార్, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేశ్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, చెట్టి ఫల్గుణ, భాగ్యలక్ష్మి జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్ర, జీవీఎంసీ మేయర్ హరి వెంకట కుమారి, వీఎంఆర్డీఏ చైర్పర్సన్ అక్కరమాని విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి జంట ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రికి తరలింపు

విశాలాంధ్ర-డుంబ్రిగూడ (అల్లూరి జిల్లా): స్థానిక పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం సమీపం, పెదపాడు రోడ్డు వద్ద ఓ పెళ్లి జంట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్ఐ సంతోశ్ కుమార్ తెలిపిన కథనం ప్రకారం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా, గోపాల్ రెడ్డి నగర్, సిరి లింగంపల్లి గ్రామానికి చెందిన పి.సంతోశ్ కుమార్, సునీత హైదరాబాదు నుంచి బస్సులో విశాఖపట్నం చేరుకొని బుధవారం స్థానిక పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం సందర్శించి, సమీపంలోని పెదపాడు రోడ్డు పక్కన ఉన్న చెట్టు కింద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. అపస్మారక స్థితిలో ఉన్న జంటను ఆ రోడ్డు వైపు వెళ్తున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని గ్రామ వలంటీర్ల సహాయంతో ద్విచక్ర వాహనంలో చాపరాయి గెడ్డ దాటించి, అక్కడి నుంచి 108లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాధిత వివాహిత గర్భవతి కావడంతో చికిత్సలు అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉంది. దీంతో వెంటనే అరకులోయ ప్రాంతీయ హాస్పిటల్‌కు తరలించినట్లు చెప్పారు. ఆర్థిక భారాన్ని మోయలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధిత జంట పోలీసులకు చెప్పినట్టు ఎస్ఐ సంతోశ్ కుమార్ తెలిపారు.

సంపాదకీయం

డబ్బు సంచుల మాయ

పార్టీ ఫిరాయించడానికి కారణాలు ఏమైనా కావొచ్చు కానీ భగవంతుడు అనుమతిస్తే ఫిరాయింపుల అక్రమాలు కూడా సక్రమాలై పోతాయి. గత మార్చిలో గోవా శాసన సభకు జరిగిన ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తరపున పోటీ చేసే అభ్యర్థులను గుళ్లు, గోపురాలు, దర్గాలు, చర్చీలు తిప్పి పార్టీ ఫిరాయించబోమని వారి చేత ప్రమాణం చేయించింది. అయినా బుధవారం కాంగ్రెస్ నాయకుడు దిగంబర్ కామత్ నాయకత్వంలో ఎనిమిది మంది శాసన సభ్యులు భేషుగ్గా బీజేపీలో చేరిపోయారు. అంతకు ముందు పార్టీ ఫిరాయించబోమని దేవుడి ఎదుట చేసిన ప్రమాణాలు ఏమైపోయాయని అమాయకంగా ప్రశ్నించే వారు ఉండొచ్చు. కానీ దేవుడి మీద విశ్వాసం ఉంచితే ఆ జటిల ప్రశ్నకూ సమాధానం దొరికి తీరుతుంది. బీజేపీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల తరపున దిగంబర్ కామత్ వకాల్తా పుచ్చుకుని "మేం మళ్లీ దేవుడి దగ్గరకెళ్లి మోదీ ప్రభుత్వం అద్భుతంగా పని చేస్తోందనీ ఆయనను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విన్నవించాం. అప్పుడు దేవుడు మీకు తోచిన నిర్ణయం తీసుకోండి అని చెప్పారు" అంటు న్నారు. ఈశ్వరుడి ఆజ్ఞ అయిన తరవాత ఇక ఫిరాయించడానికి అడ్డేమి ఉంటుంది. కామత్ నాయ కత్వంలో పార్టీ ఫిరాయించడానికి గత జులైలోనే ప్రయత్నం జరిగింది. కానీ బామాలో బతిమాలో కాంగ్రెస్ అప్పుడు ఫిరాయింపు ఆలోచన విరమించు కునేలా చేసింది. అప్పటికి సంక్షోభం తప్పినట్టే కనిపించింది. ఇప్పుడు ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు బీజేపీలో చేరి పోవాలన్న సంకల్పం కలిగిన తరవాత దేవుడు ఆపలేదనుకోవాలి. పైగా ఈ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు "కాంగ్రెస్ ఛోడో బీజేపీ జోడో" అని లయబద్ధమైన నినాదం కూడా ఇస్తున్నారు. మోదీని బలోపేతం చేయ దానికే తాము బీజేపీలో చేరుతున్నామని మైఖేల్ లోబో అనే పెద్ద మనిషి కొత్తగా బీజేపీ తీర్థం పుచ్చుకున్న నాయకుడు అంటున్నారు. మోదీ పరిపాలనను ప్రపంచ మంతా కీర్తిస్తోందని కూడా సెలవిచ్చారు. "ఇవాళ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో విలీనమై పోయారు. ఈ ప్రక్రియ త్వరలో పూర్తి అవుతుంది. మోదీ నూతన భార తాన్ని నిర్మించడానికి గోవాను అభివృద్ధి చేస్తున్నారు. మాకు మద్దతు ఇవ్వ దానికే వారు బీజేపీలో చేరారు. ఇది గోవా అభివృద్ధికి చరిత్రాత్మకమైన నిర్ణయం" అని గోవా ముఖ్యమంత్రి ప్రబోధ్ సామంత్ వెనకేసుకొచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో బీజేపీ 20 సీట్లు సంపాదించింది. ఇంతకు ముందున్న సీట్లు, ఇప్పుడు జరిగిన ఫిరాయింపులతో బీజేపీ బలం 33కు పెరిగింది. ఎన్నికలు జరిగిన తరవాత మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీకి చెందిన ఇద్దరు, ముగ్గురు ఇండిపెండెంట్లు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి బీజేపీకి దన్నుగా నిలబడ్డారు. జులైలో కాంగ్రెస్ నాయకులు ఫిరాయించ దానికి ప్రయత్నించినప్పుడు మైఖేల్ లోబో, దిగంబర్ కామత్ ఫిరాయింపు లను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించింది. వారిని అనర్హులుగా ప్రకటించాలని కూడా అభ్యర్థించింది. ఇలాంటి సందర్భాలలో స్పీకర్ ఓ పట్టాన నిర్ణయం తీసుకోకపోవడం అత్యంత సహజంగా మారిపోయింది. ఎనిమిది మంది కాంగ్రెస్ నాయకులు ఫిరాయించడంతో ఇప్పుడు కాంగ్రెస్‌లో ముగ్గురే మిగిలారు. ప్రతిపక్షాలన్నింటికీ కలిపి ఏడుగురే మిగిలారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిర్ణయం చాలా దుష్ట చింతనతో కూడుకున్నది అని గోవా ఫార్వర్డ్ పార్టీ అధ్యక్షుడు విజై సర్దేశాయ్ అన్నారు. "ఈ ఎనిమిది మంది ఫిరాయించడం సకల రాజకీయ ఔచిత్యాలకు విరుద్ధం. కనీస మర్యాద, నిజాయితీ లేకపోయింది. డబ్బు సంచులకు ఆశపడి, అధికార దాహంతోనే వారు ఫిరాయించారు. ఇది వారి స్వార్థం, సిగ్గు మాలిన తనం. దేవుడి ఎదుట చేసిన ప్రతిజ్ఞను జవదాటడం" అంటున్నారాయన. ఇవన్నీ ఫిరాయింపుదార్ల ఎదుట వృథాగా పఠించే సూక్తి ముక్తావళిగా నిలిచి పోతాయి. ఇలా సూక్తి ముక్తావళి వినిపించే వారు ఉంటారని తెలుసు కనకే ఫిరాయింపుదార్లు దేవుడి ఆనతితోనే పార్టీ మారామని సమర్థించుకుంటున్నారు. ప్రజలు మద్దతు ఇచ్చినందువల్ల బీజేపీ అధికారంలోకి రాలేదు. మోసం, దగా కారణంగా ప్రజాస్వామ్యం అప హాస్యం పాల వుతోంది. వాస్తవం ఏమిటంటే ప్రజాప్రతినిధులు అంగడి సరుకైపోయారు. అలాం టప్పుడు డబ్బు సంచులతో తులతూగుతున్న బీజేపీ ఖరీదు కట్టి ఎమ్మెల్యేలను కొనకుండా ఎలా ఉంటుంది? అంగట్లో సరుకులు కొన్న దానికన్నా సునాయాసంగా బీజేపీ ఎమ్మెల్యేలను కొనేస్తోంది. దేశంలోని అతి పెద్ద పార్టీ, అత్యంత సంపన్నమైన పార్టీ కొనకుండా ఉంటుందనుకోవడం భ్రమ. నీతి మాలిన ఈ ఫిరాయింపులు గోవాను సర్వ నాశనం చేస్తున్నాయని అంగలార్చేవారు ఉండొచ్చు. ఉంటారు. కానీ మోదీ పాలన మీద అపారమైన అనురక్తి పెంచుకుని, ఆయనను మరింత బలోపేతం చేయాలని భావించడమే కాకుండా దేవుడి అనుమతి కూడా తీసుకున్న తరవాత ఫిరాయింపుల గూర్చి వగచినందువల్ల ప్రయోజనం శూన్యం. పార్టీలు ఫిరా యిస్తున్న వారిని నమ్మి ప్రజలు ఓట్లేసి ఉండొచ్చు. లేదా తాము గెలిపించదలచుకున్న పార్టీ విధానాలో, కార్య క్రమాలు నచ్చే జనం ఓటు వేసి ఉండొచ్చు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిపోయిన తరవాత తమ ప్రతినిధులను కట్టడి చేయడానికి ప్రజలకు హక్కు లేదుగా! పార్టీ ఫిరాయించే వారిని వెనక్కు పిలిపించే హక్కు మన ఎన్నికల వ్యవస్థలోనే లేదు. ఒక్కసారి ఎన్నికైతే ఏ పార్టీ వారైనా సర్వస్వతంత్రులే. పైగా డబ్బు సంచులు అప్పనంగా వచ్చి పడ్తున్నప్పుడు కాదని కాలదన్నే అమాయకత్వం ప్రజా ప్రతినిధులకు ఉంటుందనుకోవడం కుళ్లిన ఈ సమాజ ప్రస్థానంలో సాధ్యమయ్యే పనే కాదు. ఈ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాహుల్ గాంధీ సమక్షంలో ప్రమాణ పత్రాల మీద సంతకాలు చేశారు. పార్టీకి విశ్వాస పాత్రంగా ఉంటామని హామీ ఇచ్చారు. తమ పార్టీ తరపున పోటీ చేసే వారిమీద కాంగ్రెస్‌కు నమ్మకం లేదా అని బీజేపీ ప్రశ్నిం చింది. కాంగ్రెస్‌కు నమ్మకం ఉందో లేదో వేరే విషయం. డబ్బు సంచులు కనిపించిన తరవాత కూడా ప్రలోభాలకు లొంగకుండా ఉండడానికి దేవుడి మీద నమ్మకం ఉన్న ఈ ఎమ్మెల్యేలకు ఎలా సాధ్యం అవుతుంది. బీజేపీ దగ్గర కొనుగోలు శక్తి ఉన్న ప్పుడు అంగట్లో నిలబడే ప్రజా ప్రతినిధులను కొనకుండా ఉండడం సాధ్య మయ్యే పనేనా. చెలామణీలో ఉంటేనే డబ్బుకు విలువ. లేకపోతే అవి కేవలం కాగితం ముక్కలతో సమానం. భ్రష్ట రాజకీయాలను, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులుగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులను కొనుగోలు చేసే కళలో బీజేపీ ఆరి తేరిపోయింది. కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యం సాధించడానికి ఎన్నికల్లో పోటీ చేసి కాంగ్రెస్‌ను ఓడించడం ఒక్కటే మార్గం అనుకుంటే లక్ష్య సిద్ధి అసాధ్యం అవుతుంది. అనుకున్నది సాధించడానికి ఉన్న అవకాశాలన్నింటినీ వినియో గించుకునే సమర్థత, సాహసం, తెంపరితనంలో బీజేపీని మించిన పార్టీ ఎక్కడుంది గనక!

అసమర్థ పాలనపై దండయాత్ర

పోతుల బాలకోటయ్య

తెలుగు నేలపై ప్రజా రాజధాని అమరావతి ఉద్యమం 1000 రోజుల చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకొని రాజధాని రైతులు అమరావతి నుండి అరసవల్లికి రెండవ విడత పాదయాత్ర చేపట్టారు. ఒకవైపు రైతుల సుదీర్ఘ ఉద్యమం, మరో వైపు అత్యున్నత న్యాయస్థానం తీర్పులు. రాష్ట్ర ప్రభుత్వ పాలనా తీరును, మూడు రాజధానుల 'తుగ్లక్' విధానాన్ని తప్పుపడుతుంటే ప్రభుత్వం వెనక్కి తగ్గకపోగా, కనీసం ఒక కమిటీని వేసి రాజధాని ఉద్యమకారులతో, భూములు ఇచ్చిన రైతులతో చర్చించిన పాపాన పోలేదు. న్యాయస్థానాల తీర్పును గౌరవిస్తున్నాం అంటూనే పవిత్రమైన అసెంబ్లీలో న్యాయమూర్తులను హేళన చేస్తారు. మూడు రాజధానులపై మళ్లీ ప్రసంగాలు చేస్తారు. మూడు ముక్కల బిల్లును వెనక్కి తీసుకున్నాం, సీఆర్డీఏ చట్టాన్ని అమలు చేస్తాం అంటూనే రాజధాని ఉద్యమంపై కడవల కొద్దీ విషం కక్కుతారు. తాజాగా రైతులు చేపట్టిన అరసవల్లి పాదయాత్రపై కొందరు మంత్రులు, విశిష్ట స్థానంలో ఉన్న స్పీకర్ సైతం 'అది పాదయాత్ర కాదు ఉత్తరాంధ్రపై దండయాత్ర' అని న్యాయ తీర్పుపై దాడి చేశారు. రాజధాని రైతులు రాష్ట్రంలోని ప్రజలే కాదు అన్నట్టు, స్వార్థంతో తమ ప్రాంతంలో మాత్రమే రాజధాని ఉండాలని, మిగిలిన ప్రాంతాల అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శలు చేశారు. పాదయాత్రను పలుచన చేస్తే లేదా ఉత్తరాంధ్రలో భావోద్వేగాలను రెచ్చగొడితే ఫలం, ఫలితం దక్కుతుందేమో అన్న ఆశతో పాదయాత్ర చేస్తున్న వారికి అపాయం తలపెట్టే స్థాయిలో 'చూస్తూ ఊరుకోం' అని హెచ్చరికలు కూడా చేశారు. ఇలాంటి 'దాడి' చేసిన నాయకులు రాజధాని నిర్మాణ సమయంలో, భూములను సమీకరిస్తున్న సమయంలో అమరావతి గూర్చి ఒక్క మాట మాట్లాడి ఎరుగరు. ఏ ఒక్క నిరసన దీక్ష చేసి ఎరుగరు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సైతం అసెంబ్లీలో అమరావతి ఏకగ్రీవ తీర్మానానికి పూర్తి మద్దతు ప్రకటించారు. రాష్ట్ర మధ్యస్థ ప్రాంతంగా ఉన్న విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఉండాలని, 30 వేల ఎకరాలకు తగ్గకూడదని చెప్పారు. ఇల్లు కట్టుకున్నామని, కార్యాలయం పెట్టుకున్నామని చెప్పారు. చంద్రబాబు కంటే మిన్నగా రాజధాని నిర్మాణం జరుగుతుందని చెప్పారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్ వంటి వారి మేనిఫెస్టోలోను రాజధాని అమరావతే అని పెట్టారు. పైగా ఇప్పటివరకు రాజధానిపై ప్రభుత్వం చేసిన ఏ ఒక్క ఆరోపణను నిరూపించలేదు. అమరావతిలో జరిగిందని చెప్పిన లక్ష కోట్ల అవినీతిలో లక్ష రూపాయలు పట్టుకోలేదు. ఆర్థిక మంత్రి చెప్పిన 4 వేల ఎకరాల ఇన్సైడర్ ట్రేడింగ్‌లో ఎకరం పొలం స్వాధీనం చేసుకోలేదు. ఒక సామాజిక వర్గం, ఎడారి, స్మశానం తాజాగా దయ్యాల రాజధాని వంటి మాటలకు అణాకాని అర్థపర్థం లేదు. విలువ లేదు. అతి చిన్న రాష్ట్రానికి ఒక రాజధాని చాలు అన్న భావన బలంగా ఉండటాన్ని అందరూ గుర్తించారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు పాదయాత్రకు భయపడ్డారో లేదా రాజధాని ఉద్యమంపై కర్కశంగా దాడి చేస్తే ముఖ్యమంత్రి కనికరించి క్యాబినెట్లో బెర్త్ ఇస్తారని భావించారో, ఉన్న సీటుకు భద్రత ఉంటుందని అనుకున్నారో ఏమో కానీ, పాదయాత్రపై పిచ్చెక్కినట్లుగా వ్యాఖ్యలు చేశారు. నిజానికి రైతు మహిళలు చేపట్టిన అరసవల్లి పాదయాత్ర దండయాత్రే. అయితే వైసీపీ నాయకులు చెప్పిన అర్థంలో కాదు అది ప్రభుత్వ అసమర్థ పాలనపై దండయాత్ర. రాజధాని లేకుండా చేసిన పాలకులపై దండయాత్ర. అభివృది లేమిపై, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరిగిన, జరుగుతున్న దాడులు, హత్యలు, శిరోమండనాలు, అత్యాచారాల వ్యతిరేక దండయాత్ర. రాజధానిని కాపాడుకోవడంతో పాటు మూడు ప్రాంతాలు ఒక రాష్ట్రంగా కలిసి ఉండాలని చేస్తున్న మరో సమైక్యాంధ్ర పాదయాత్ర. పాదయాత్రపై ప్రభుత్వ దాడికి అవకాశం లేదనే ఆరోపణలను కూడా కొట్టి వేయలేం. ఏ అర్ధరాత్రో, అపరాత్రో పాండవుల అరణ్యవాసంలోని లంక ఇంటిని కౌరవులు తగలబెట్టినట్లు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏదైనా చేయదన్న గ్యారెంటీ లేదు. ఇందుకు డీజీపీదే బాధ్యత. పాదయాత్ర నిర్వాహకులు కూడా అప్రమత్తంగా ఉండాలి. పాదయాత్రపై ఒక రాయి పడ్డ, ఏ ఒక్క మహిళకు గాయమైనా ఉద్యమ స్ఫూర్తికి విఘాతం కలుగవచ్చు. స్వీయ పర్యవేక్షణ, రక్షణ చేసుకోగలగాలి. మూడు అడుగుల నేల కోసం వామనుడు బలి చక్రవర్తిని పాతాళానికి తొక్కితే, 34,323 ఎకరాలు ఇచ్చిన 29,881 మంది రైతుల 59,762 అడుగులతో 600 కిలోమీటర్ల మహా పాదయాత్ర పాలకులను ఎంత లోతు తొక్కాలో ఏపీ ప్రజలు 'తీర్పు' చెప్పాలి.

వ్యాస రచయిత అమరావతి బహుజన జెఎసి అధ్యక్షులు

వామపక్షాల బాధ్యత పెరిగింది

టి.వి.సుబ్బయ్య

యుపిఎ ప్రభుత్వ పాలనలో వామపక్షాల బలం పార్లమెంటులో గణనీయంగా ఉండటంతో ప్రజా జీవన ప్రమాణాలను పెంచే నిర్ణయాలు జరిగాయి. రైతు రుణాలు దాదాపు 60 వేల కోట్ల రూపాయల రద్దు, బలమైన ఆర్టీఐ చట్టం, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం ప్రవేశపెట్టడం లాంటివి అమలులోకి వచ్చాయి. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నిర్ణయాలన్నింటినీ నిర్వీర్యం చేశారు. క్రమంగా రాజ్యాంగానికి, స్వాతంత్ర్యానికి ప్రమాదం కలిగించే నిర్ణయాలు అమలు జరుగుతున్నాయి. హిందూ మతం బలంగా ఉన్నందున ఆ దిశలో ఆర్‌ఎస్‌ఎస్ దాని రాజకీయ సంస్థ బీజేపీ హిందుత్వను హిందువులను రెచ్చగొట్టి అధికారం చేపట్టాయి. మోదీ ప్రభుత్వంలో సామాన్యులకు కడగండ్లు, సంపన్నులకు ప్రయోజనాలు దక్కాయి. గతంలో ప్రజలకు కలిగిన మేళ్లను తుడిచేసి గోబెల్స్ ప్రచారంతో ప్రజలను ఆకర్షిస్తూ బూటకపు అభివృద్ధిని మన ముందుంచుతున్నారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ పన్ను విధానం, దుష్ట సాగు చట్టాలు, కార్మికుల హక్కులు, సౌకర్యాలు హరించే నాలుగు కోడ్ల రూపకల్పన, అనేక రాష్ట్రాల హక్కుల హరణ, దేశాభివృద్ధి, సమాజ ప్రగతికి కీలకమైన విద్య, వైద్య రంగాలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడం, ప్రత్యర్థులపై, దర్యాప్తులను ఉసిగొల్పి దాడులు చేయించి వేధించడం, కులాలు ముఖ్యంగా మతాల మధ్య ద్వేషం రెచ్చగొట్టడం లాంటి అనేక విధ్వంసకర నిర్ణయాలు అమలు జరుగుతున్నాయి. చరిత్రను, పాఠ్యాంశాలను మార్చివేసి ఎంత మాత్రం శాస్త్రీయత, నిర్ధారణలు లేని పుక్కిటి పురాణాలను, జ్యోతిష్యం, మూఢ నమ్మకాలను పెంపొందించడం లాంటి సామాజిక తిరోగమన చర్యలను వేగంగా అమలు చేస్తున్నారు.

ప్రస్తుతం ఉన్న హానికరమైన, ప్రజా వ్యతిరేక విధానాలు అమలుపరిచే పాలన స్థానంలో, ప్రజానుకూల కార్యాచరణను చేపట్టే ప్రభుత్వం ఏర్పడాలి. అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అవతరించి అనేకానేక కారణాల వల్ల కాంగ్రెస్, వామపక్షాలు బలహీనపడ్డాయి. తిరిగి పుంజుకొనేందుకు కాంగ్రెస్ చేస్తున్న యత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో చెప్పలేము. ఈ నేపథ్యంలో ముందుగా వామపక్షాలన్నీ ఒక వేదిక పైకి రావలసిన చారిత్రక తరుణం ఇది. ప్రతిపక్షాల మధ్య విభేదాలున్నప్పటికీ దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా ఫ్రంట్‌గా ఏర్పడి అమలు చేయగల కార్యాచరణను ప్రకటించి ఉమ్మడి ఉద్యమాలను నిర్వహించాలి. మోదీ పాలనలో జరిగిన జరుగుతోన్న విధ్వంసక విధానాలను వివరిస్తూ విస్తృత ప్రచారం చేయాలి. అయితే ఇదీ ఒక విద్వేష ప్రచారం కాకూడదు. వ్యక్తుల మధ్య దూషణ పర్వానికి స్వస్తి చెప్పి, విధ్వంసకర విధానాల హానిని విపులంగా వివరించాలి. ఎన్నికల కమిషన్‌తో సహా స్వయం ప్రతిపత్తి గల అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ పూర్తిగా పాలకుల కనుసన్నల్లో నడుస్తున్నాయి. పాలకుల విధానాలు విమర్శించినా, విచ్ఛిన్నకర విధానాల పట్ల నిరసన తెలిపినా, రచనలు చేసినా బెయిల్ కూడా రాకుండా విచారణ లేకుండా జైళ్లపాలు చేసి వేధిస్తున్నారు. అన్నీ తెలిసిన మేధావులు, శాస్త్రవేత్తలు, న్యాయ పాలకులు, సమాజ సామరస్యతను కోరుకుంటున్న మెజారిటీ హిందువులు, రచయితలు మౌనం వహిస్తే సమాజానికి మరింత కీడు జరుగుతుంది. చివరకు న్యాయమూర్తులను సైతం ప్రభావితం చేసి తమ లక్ష్యాలను పాలకులు సాధించుకుంటున్న ఘటనలున్నాయి.

ప్రధానమైన వామపక్షాలు, ఇతర చిన్నచిన్న వామపక్షాలను ఐక్యపరిచి కార్యాచరణకు పూనుకోవాలి. అలాగే యుపిఎ ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర వహించినట్లుగానే ఈసారి కూడా ముఖ్య భూమికను నిర్వహించాలి. ప్రతిపక్షాల ఐక్యతకు కృషి చేయడానికి ముందుకు వచ్చిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆ దిశలో ఆలోచిస్తున్న శరద్ పవార్, మమతా బెనర్జీ, కేసీఆర్, కేజ్రీవాల్‌ను ఒప్పించారు. ఎందుకంటే రాష్ట్రాల్లో బలంగా ఉన్నందున ప్రధాన మంత్రి పదవిని కోరుకోవచ్చు. కోరడంలో తప్పులేదు. అయితే వారసత్వ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని సర్దుబాటు వైపునే ఆలోచించడానికి ప్రాధాన్యత నివ్వాలి. లేకపోతే అనుకున్న లక్ష్యం నెరవేరదు. మోదీ పాలన మరింత కాలం కొనసాగితే ఆయన ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయరు. ప్రతి అంశాన్ని అబద్ధంతో జత చేయగల నేర్పరి. కరోనాను మూడు వారాల్లో అదుపు చేస్తానని మాట్లాడటం వాస్తవ విరుద్ధమైంది. మోదీ పాలనలో ఆర్థిక, సామాజిక అంతరాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అభివృద్ధి అంటే దేశ ప్రజలంతా ఆర్థికంగా పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. సంపన్నులు మరింత సంపన్నులు కావడం, దారిద్ర్యం, పేదల సంఖ్య పెరగడం, అన్ని నిత్యావసర వస్తువుల ధరలు, అతి ముఖ్యమైన పెట్రోలు, డీజిలు తదితర ఇంధనాలు, విద్యుత్ ఛార్జీల పెంపుదల లాంటివి ప్రజల అభివృద్ధిని, జీవన ప్రమాణాల మెరుగుదలను అడ్డుకుంటాయి. ఈ అంశాలను ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, వీటి అనుబంధ సంస్థలు శ్రేణులు, కార్యకర్తలు సైతం ఆలోచించాలి. సామాజిక సామరస్యతను, సఖ్యతను దెబ్బతీసే మూఢ నమ్మకాలను, విద్వేషాన్ని పెంచితే చరిత్ర ఇలాంటి శక్తులు విధ్వంసకరమైనవని నమోదు చేస్తుంది.

ప్రతిపక్షాలన్నీ కలిసి కట్టుగా ఉంటేనే 'బాహుబలుడి' గా ఎదిగిన మోదీని ఢీకొని కనీసం ఆయన ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడం సాధ్యమవుతుంది. ఇప్పటికే కాంగ్రెస్‌పై విరుచుకుపడుతున్న కేజ్రీవాల్ చివరికి ఎటుంటాడోనన్న సందేహాలున్నాయి. మోదీ వేధింపులను మొదట ఎదిరించి ఆ తర్వాత రూటు మార్చుకున్నాడు. రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఆప్‌ను మరింత విస్తరించుకునేందుకు త్వరలో ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లో కాంగ్రెస్‌ను, బీజేపీని కేజ్రీవాల్ విమర్శిస్తున్నాడని కూడా భావించవచ్చు. కాంగ్రెస్ లేకుండా ప్రతిపక్షాల ఫ్రంట్ 2024 ఎన్నికల్లో గెలుపు లక్ష్యం నెరవేరడం కష్టం. అలాగే కేసీఆర్, మమతలు యోచించాలి. వామపక్షాలకు కేరళ లాంటి చోట్ల కాంగ్రెస్‌తో సఖ్యత సాధ్యం కాదు. అయితే ప్రతిపక్షాల ఫ్రంట్ ఏర్పాటుకు కృషి చేయవలసిన తరుణం ఇది. అక్టోబరు 14-18 తేదీలలో జరగనున్న సీపీఐ జాతీయ మహాసభలు చర్చించి నిర్ణయం తీసుకుంటాయని భావించవచ్చు.

మోక్షగుండం మరపురాని ఇంజినీరు!

ఇంజినీర్ అనగానే మనకు గుర్తుకొచ్చే పేరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఆయన గొప్ప ఆర్థికవేత్త, పాలనాదక్షునిగా కూడా పేరుపొందారు. ఇంజినీరింగ్ రంగానికి చేసిన సేవలకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 15వ తేదీని ఇంజినీర్స్ డే గా జరుపుకుంటున్నాం. పాత మైసూర్ సంస్థానంలోని (ప్రస్తుత కర్నాటక రాష్ట్రం) చిక్‌బళ్ళాపూర్ తాలూకా ముద్దెనహళ్లిలో 1861లో సెప్టెంబర్ 15న శ్రీనివాస శాస్త్రి, వెంకట లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు మోక్షగుండం విశ్వేశ్వరయ్య. వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మోక్షగుండం గ్రామానికి చెందినవారు. 12వ ఏటనే తండ్రిని కోల్పోయి దుఃఖాన్ని దిగమింగుతూ విద్యాభ్యాసం పూర్తి చేసిన ఈయన 1912-1918 మధ్య కాలంలో మైసూర్ సంస్థానానికి దివానుగా పని చేశారు. పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందడానికి ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించి గొప్ప ఆర్థికవేత్తగా గుర్తింపు పొందారు. మైసూర్ దివానుగా ప్రజలకు చేసిన సేవలకుగాను బ్రిటిష్ ప్రభుత్వం 'నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్' బిరుదునిచ్చి సత్కరించింది. సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా అభ్యసించిన ఈయన మూసీ వరదల నుంచి హైదరాబాద్‌ను రక్షించడానికి పథకాలను రూపొందించారు. హైద్రా బాద్‌కు మురుగు నీటి పారుదల వ్యవస్థ నిర్మిం చిందీ

ఈయనే. విశాఖ పట్నం ఓడరేవును సము ద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థ రూపొందించ డంలో, తిరుమల తిరుపతి ఘాట్ రోడ్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 30 సంవత్సరాలపాటు ఇంజినీరింగ్ రంగంలో అపారమైన సేవలందించి దేశప్రగతికి ఎంతగానో దోహదపడ్డ విశ్వేశ్వరయ్య ఇంజినీర్‌గా, పాలనాదక్షునిగా ఎంతో కీర్తిని సొంతం చేసుకున్నారు. ఈయనకు లండన్‌లోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్ సంస్థ, బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లు గౌరవ సభ్యత్వాన్ని ఇచ్చాయి. స్వాతంత్ర్యం వచ్చాక 1955లో భారతదేశపు అత్యున్నత పౌరపురస్కారం భారతరత్న ప్రదానం చేశారు. 102వ ఏట ఈయన మరణించారు.

వేమూరి శ్రీనివాస్

తెలంగాణలో అధికారం కోసం బీజేపీ ఎత్తుగడలు

యండి.ఉస్మాన్ ఖాన్

నిజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడమన్నది చారిత్రక రాజకీయ పరిణామం. విలీన సమయాన ముస్లిం అయినటు వంటి నిజాం రాజు పాలకుడుగా ఉన్నాడు కాబట్టి 'ముస్లిం పాలన' నుండి విమోచన అన్న అర్థంలో బీజేపీ దీన్ని హిందూ ముస్లిం సమస్యగా చిత్రీకరించే ప్రయత్నాలు బలంగా చేస్తున్నది. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి. ఇలాంటి ప్రయత్నం ఖచ్చితంగా కులాలమధ్య, మతాలమధ్య చిచ్చుపెట్టే దుర్మార్గపు చర్య మాత్రమే కాదు, చరిత్ర వక్రీకరణ కూడా! ఆనాడు ముస్లిం రాజు పాలకుడుగా ఉండడం అనేది కేవలం యాదృచ్ఛికమే తప్ప మరేమీకాదు. ఆ మాటకొస్తే నిజాంకు వ్యతిరేకంగా అనేక మంది ముస్లింలు పోరాడారు. మఖ్దూం మొహియుద్దీన్, షోయబుల్లా ఖాన్, షేక్ బందగీ లాంటి వాళ్ళ వీరోచిత పాత్రను మనం విస్మరించగలమా? మరి వాళ్ళు ముస్లింలు కారా? మరోవైపు అనేక మంది దేశ్‌ముఖ్‌లు నిజాంకు మద్దతుగా నిలిచారు. నిజాం నజరానాలకు కక్కుర్తి పడి 'జీ హుజూర్' అన్నారు. మరి వాళ్ళు హిందువులు కాదా?. అందుకని దీన్ని మత కోణంలో చూడడం దుర్మార్గం. అయితే, నిజాం కూడా మచ్చలేనివాడు, సుద్దపూస అనీ ఎవరూ అనడంలేదు. రజాకార్ల పేరుతో ఆ రోజుల్లో జరిగిన అరాచకాలకు నిజాం ఎంత బాధ్యుడో, అంతకంటే అనేక రెట్లు దేశ్‌ముఖ్‌లు, దొరలు, పటేళ్ళే ఎక్కువ బాధ్యులు.

కేంద్రంలో ఎనిమిదేళ్ళుగా అధికారం వెలగబెడుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అకస్మాత్తుగా ఈ యేడు సెప్టెంబర్ 17ను ప్రభుత్వపరంగా ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. విమోచన పేరుతో ఏడాది పొడుగునా నిర్వహిస్తామంటున్న ఈ వేడుకల వెనుక తెలంగాణ గడ్డను ఏదో విధంగా కలుషితం చెయ్యాలన్న దుర్బుద్ధి తప్ప ఇందులో చిత్తశుద్ధిగాని, ప్రజా ప్రయోజనంగాని ఏ కోశానా కానరావడంలేదు. పైగా ప్రజాధన దుర్వినియోగం, మతాల మధ్య దూరం పెంచే, చిచ్చు పెట్టే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి. బీజేపీ దేశ పగ్గాలు చేపట్టిన ఎనిమిదేళ్ళకు సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని గుర్తుకు రావడం ఆశ్చర్యకరం. అధికారం కోసం ఆ పార్టీ ఎంతకైనా బరి తెగిస్తుందన్నది అనేక సందర్భాల్లో రుజువైన వాస్తవం. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడిచిపోయ్యాయి. ఈ సుదీర్ఘ స్వాతంత్ర్య ప్రస్థానంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించింది. ఇంకా సాధించాల్సింది చాలా ఉంది. దృష్టి పెట్టాల్సిన, చర్చించాల్సిన విషయాలు అనేకం ఉన్నాయి. అవన్నీ పక్కన పెట్టి సెప్టెంబర్ 17 మాత్రమే దేశానికి చావో రేవో సమస్య అన్నట్లు విమోచనా దినోత్సవం పేరిట తెలంగాణ అలయ్ బలయ్ సంస్కృతిని, గంగా జమునా తహెజీబ్ వారసత్వాన్ని నాశనం చేసి తెలంగాణ గడ్డపై కాషాయ జెండా పాతాలని బీజేపీ ఎత్తుగడ వేసింది. ఒక రాజకీయ పార్టీగా అధికారాన్ని అందుకోవాలన్న ఆశ ఆ పార్టీకి ఉండవచ్చు. దానికోసం రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య విధానాలను అనుసరించాలి తప్ప, లేని దేశభక్తి డబ్బా కొట్టుకుంటూ, కులాలు, మతాలమధ్య చిచ్చు పెట్టి, భావోద్వేగాలను రగిలించి అందలాన్ని అందుకోవాలనుకోవడం దుర్మార్గం. సెప్టెంబర్ 17 విషయంలో వారికీ ఒక అభిప్రాయం ఉండవచ్చు. ఎవరి అభిప్రాయం వారిది. ఎవరి వాదన వారిది. కానీ మందబలంతో, నియంతృత్వ పోకడలతో అప్రజాస్వామికంగా ఒక్కొక్క రాష్ట్రాన్నీ బలహీన పరచి, తమకు అనుకూలమైన కీలు బొమ్మలను ప్రతిష్ఠించుకుంటున్న బీజేపీ ఈ కోణంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ఒక పావుగా వినియోగించుకోవాలని, రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలని చూడడమే దుర్మార్గం. ఇదే అసలు విషయం తప్ప తెలంగాణపైగాని, సాయుధ రైతాంగ పోరాటంపైగాని, అసలు ఆ మాటకొస్తే స్వాతంత్రోద్యమం పట్ల బీజేపీకి కించిత్ చిత్తశుద్ధి లేదనేది జగమెరిగిన సత్యం.

నిజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడమన్నది చారిత్రక రాజకీయ పరిణామం. విలీన సమయాన ముస్లిం అయినటువంటి నిజాం రాజు పాలకుడుగా ఉన్నాడు కాబట్టి 'ముస్లిం పాలన' నుండి విమోచన అన్న అర్థంలో బీజేపీ దీన్ని హిందూ ముస్లిం సమస్యగా చిత్రీకరించే ప్రయత్నాలు బలంగా చేస్తున్నది. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి. ఇలాంటి ప్రయత్నం ఖచ్చితంగా కులాలమధ్య, మతాలమధ్య చిచ్చుపెట్టే దుర్మార్గపు చర్య మాత్రమే కాదు, చరిత్ర వక్రీకరణ కూడా! ఆనాడు ముస్లిం రాజు పాలకుడుగా ఉండడం అనేది కేవలం యాదృచ్ఛికమే తప్ప మరేమీకాదు. ఆ మాటకొస్తే నిజాంకు వ్యతిరేకంగా అనేక మంది ముస్లింలు పోరాడారు. మఖ్దూం మొహియుద్దీన్, షోయబుల్లా ఖాన్, షేక్ బందగీ లాంటి వాళ్ళ వీరోచిత పాత్రను మనం విస్మరించగలమా? మరి వాళ్ళు ముస్లింలు కారా? మరోవైపు అనేక మంది దేశ్‌ముఖ్‌లు నిజాంకు మద్దతుగా నిలిచారు. నిజాం నజరానాలకు కక్కుర్తి పడి 'జీ హుజూర్' అన్నారు. మరి వాళ్ళు హిందువులు కాదా?. అందుకని దీన్ని మత కోణంలో చూడడం దుర్మార్గం. అయితే, నిజాం కూడా మచ్చలేనివాడు, సుద్దపూస అనీ ఎవరూ అనడంలేదు. రజాకార్ల పేరుతో ఆ రోజుల్లో జరిగిన అరాచకాలకు నిజాం ఎంత బాధ్యుడో, అంతకంటే అనేక రెట్లు దేశ్‌ముఖ్‌లు, దొరలు, పటేళ్ళే ఎక్కువ బాధ్యులు.

మన ప్రజాస్వామ్య భారతావనిలో భిన్నకులాలు, భిన్నమతాలు, భిన్న వర్గాలు, భిన్నసంస్కృతీ సంప్రదాయాలకు చెందిన ప్రజలు ఎంతో అన్యోన్యంగా, ఆప్యాయంగా, సామరస్యంగా, పాలూ పంచదారలా కలసీమెలసీ సహజీవనం చేస్తున్నారు. ఇటువంటి వాతావరణంలో ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా రాజకీయ పార్టీలు విజ్ఞతతో, విశాల దృక్పథంతో వ్యవహరించాలి. హిందూ ముస్లిం అనే సంకుచిత మనస్తత్వంతో వ్యవహరిస్తే దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి, దేశ లౌకిక వారసత్వానికి తీవ్రమైన విఘాతం కలుగుతుంది. లేనిపోనివి ప్రచారం చేసి, ప్రజల భావోద్రేకాలను రెచ్చగొడితే మతసామరస్యానికి విఘాతం కలుగుతుంది. భారత ప్రజలు ముఖ్యంగా తెలంగాణ బిడ్డలు బీజేపీ, మతోన్మాద ఫాసిస్టు శక్తుల దుష్ప్రచార వలలో చిక్కకుండా, విజ్ఞతతో వ్యవహరించాలి. దేశ లౌకిక, ప్రజాస్వామ్య వారసత్వ స్ఫూర్తిని కొనసాగించాలి. సామరస్య వాతావరణానికి ఆవగింజంత హాని కూడా కలగకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటూ, దుష్టులు, దుర్మార్గులు, మతోన్మాద ఫాసిస్టు శక్తుల బారినుండి దేశాన్ని రక్షించుకోవాలి. ఇది ప్రస్తుతం భారతీయులు, ముఖ్యంగా తెలంగాణ పౌరుల ముందున్న తక్షణ కర్తవ్యం.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు
9912580645

'రాఫెల్' విచారణకు ఆటంకాలు

- రహస్య పత్రాలు ఇవ్వని రెండు మంత్రిత్వ శాఖలు
- మీడియాపార్ట్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత్-ఫ్రాన్స్ దేశాల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం 36 రాఫెల్ యుద్ధ విమానాలను ఆ దేశం భారత్‌కు విక్రయించడంపై వివాదం నెలకొంది. దీంతో కోర్టు విచారణ క్రమంలో ఇద్దరు ఫ్రెంచ్ న్యాయమూర్తులకు సైనిక రహస్యం ఆటంకంగా మారింది. ఫ్రెంచ్ మాధ్యమం 'మీడియాపార్ట్' ప్రకారం, ఈ ఏడాది ఫిబ్రవరిలో డస్సాల్ట్ ఏవియేషన్ (రాఫెల్ తయారీదారులు) కార్యాలయాల్లో తనిఖీ జరిగినప్పటి నుంచి విచారణ ముందుకు సాగలేకపోయింది. ఏడాది నుంచి ఈ వ్యవహారాన్ని న్యాయమూర్తులు వర్జీనీ టిల్మాంట్, పాస్కల్ గాస్టినో విచారిస్తున్నారు. 7.8 బిలియన్ యూరోలు విలువ చేసే అమ్మకంలో 'అవినీతి', 'ఇన్ఫ్లుయన్స్ పెడ్లింగ్', 'అభిమానవాదం' (ఫేవరేటిజం) అనుమానాలపై దృష్టి సారించారు. ఫ్రెంచ్ పోలీస్ అవినీతి నిరోధక శాఖ ఓసీఎల్‌సీఐఎఫ్ఎఫ్‌లోని బృందం 'మీడియాపార్ట్' ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో పారిస్ శివార్లలోని సెయింట్ క్లౌడ్‌లోగల డస్సాల్ట్ ప్రధాన కార్యాలయంలో తనిఖీ చేశారు. ఈ తనిఖీల గురించి కంపెనీ నుంచి స్పందన లేదు అని మీడియాపార్ట్ తెలిపింది. ఈ కేసులో ముందుకు వెళ్లడం కష్టమని జూన్‌లో న్యాయమూర్తులు భావించారు. విచారణకు అవసరమైన కొన్ని రహస్య పత్రాలను బహిర్గతం చేయడానికి సంబంధిత ప్రభుత్వ మంత్రిత్వశాఖలు నిరాకరించడంతో ప్రతిష్ఠంభన నెలకొన్నది. ఆ పత్రాలను యథాతథంగా ఉండనివ్వాలని కమిషన్ డు సీక్రెట్ డే లా డిఫెన్స్ నేషనలే (సీఎస్‌డీఎన్) అన్ని ప్రభుత్వ శాఖలకు సిఫార్సు చేసినట్లు మీడియాపార్ట్ నివేదిక తెలిపింది. ఎటువంటి ఆటంకం లేకుండా ఈ విచారణ కొనసాగితే ఫ్రాంకోయిస్ హొలాండే (2015లో ఈ విక్రయం జరిగినప్పుడు అధ్యక్షుడిగా ఉన్నారు) న్యాయచిక్కుల్లో పడేవారు. ఆ తర్వాత పదవిని అధిష్టించిన ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, మాజీ మంత్రి జీన్ యేవెస్ లీ డ్రెయిన్‌పైనా ప్రశ్నలు ఉత్పన్నమయ్యేవి అని మీడియాపార్ట్ పేర్కొంది. 2021 ఏప్రిల్‌లో వెలువడిన మీడియాపార్ట్ నివేదికల ఆధారంగానే ఈ ఒప్పందం నేపథ్య దర్యాప్తు మొదలైంది. మధ్యవర్తిత్వంపై ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. భారతీయ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు మధ్యవర్తిత్వం గురించి సమాచారం ఉన్నాగానీ ఆ దిశగా దర్యాప్తు చేయడానికి చర్యలు చేపట్టలేదు. రాఫెల్ ఒప్పందం క్రమంలో అవినీతి, మనీలాండరింగ్, పన్ను మినహాయింపులు జరిగినట్లు ఫ్రెంచ్ అవినీతి నిరోధక ఎన్జీవో షెర్పా ఫిర్యాదు చేసింది. తొలుత 2019లో ఫిర్యాదు నమోదు చేసింది. 2021లో చేసిన రెండవ ఫిర్యాదు తర్వాత విచారణ మొదలు అయింది. అయితే ప్రభుత్వ వ్యూహాత్మక కార్యచరణపై షెర్పా ఫిర్యాదుదారులు అసంతృప్తిగా ఉన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలను పరిరక్షించడానికి, మోసాన్ని కప్పిపుచ్చేందుకు ఉన్నతస్థాయిలో ఉన్న వారు లేక ప్రైవేటు వ్యక్తులు శిక్షల నుంచి తప్పించుకునేలా సైనిక రహస్యాన్ని అడ్డుపెట్టుకొని 'విండో డ్రెస్సింగ్'గా వాడుతున్నారని షెర్పా న్యాయవాదులు విలియం బౌర్డాన్, విన్సెంట్ బ్రెన్‌గార్ట్ అన్నారు. 2021, సెప్టెంబరులో నాటి ఒప్పంద నేపథ్య సమాచారం కోసం సంబంధిత పత్రాలను అందజేయాలని సాయుధ దళాల మంత్రితో పాటు అప్పటి విదేశాంగ మంత్రి జీన్-వైవ్స్ లే డ్రియన్‌ను జడ్జీలు కోరారు. భారత్‌కు రాఫెల్ విమానాలను విక్రయించే ఒప్పందానికి సంబంధించిన చర్చలపై రెండు మంత్రిత్వశాఖల వద్ద ఉన్న రహస్య పత్రాలను తెప్పించడమే ఈ చర్య ముఖ్యఉద్దేశం' అని మీడియాపార్ట్ నివేదించింది. ప్రత్యేకించి మీడియాపార్ట్ వార్తల్లో ఎంత నిజమున్నదో జడ్జీలు పరిశీలించాలని అనుకున్నారు. భారతీయ చట్టప్రకారం కీలకమైన అవినీతి నిరోధక నిబంధనలు ఒప్పందం నుంచి తొలగించినట్లు మీడియాపార్ట్ వెల్లడించింది. సంబంధిత పత్రాలను గుర్తించి వాటిని సీఎస్‌డీఎన్‌కు పంపేందుకు మంత్రిత్వశాఖలకు ఏడున్నర నెలల సమయం పట్టింది. ఈ ఏడాది జూన్ 8న ఎలాంటి కారణం చెప్పకుండా సంబంధిత పత్రాలను వర్గీకరించవద్దని సీఎస్‌డీఎన్ సూచించింది. అలా ఎందుకు చేసిందో చెప్పడం కష్టమని మీడియాపార్ట్ పేర్కొంది. ఆ వెంటనే పత్రాల వర్గీకరణకు మంత్రిత్వశాఖలు నిరాకరించాయి. ఆ తర్వాత రాఫెల్ విమానాల విక్రయానికి సంబంధించిన అంతర్-ప్రభుత్వ ఒప్పందం గురించి విదేశాంగ శాఖ స్పందించింది. రాఫెల్ విమానాల సరఫరా బాధ్యత ఫ్రెంచ్ ప్రభుత్వానిదేనని తెలిపింది. ఈ ఒప్పందంతో ఫ్రెంచ్ కంపెనీ డస్సాల్ట్ ఏవియేషన్‌తో పాటు భారత్ వైపు నుంచి అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూపు ముడిపడి ఉంది. 126 రాఫెల్ జెట్ల కొనుగోలు, తయారీ గురించి డస్సాల్ట్, భారత్‌కు మధ్య అధికారికంగా సంప్రదింపులు జరుగగా ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకొని 36 యుద్ధ విమానాల కొనుగోలు కోసం మరో ఒప్పందం చేసుకున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. మోదీ నిర్ణయం గురించి చివరి వరకు అప్పటి భారతీయ రక్షణ మంత్రి మనోహర్ పారికర్‌కు తెలియదు అని మీడియాపార్ట్ తెలిపింది. అంబానీకి దీనిగురించి ఎంతో కొంత సమాచారం ఉన్నట్లు తెలిపింది. ఈ ఒప్పందంపై ఫ్రెంచ్ దర్యాప్తు అవాంతరాలు వచ్చినాగానీ కొనసాగుతుండగా భారత్‌లో ఇటువంటి దర్యాప్తు చేపట్టలేదు. అనేక జర్నలిస్టుల అధ్యయనాల్లో సాక్ష్యాధారాలు లభించినా దీనిపై ఎఫ్ఐఆర్, విచారణ అవసరమన్న వాదనలను సుప్రీంకోర్టు గతంలో తోసిపుచ్చింది.

కర్తవ్యపథ్‌పై 120 ఐస్‌క్రీమ్ బండ్లు, 30 నీటి కేంద్రాలు

ఎన్‌డీఎంసీ చైర్మన్ సతీశ్ ఉపాధ్యాయ

న్యూఢిల్లీ : కొత్త హంగులతో కర్తవ్యపథ్‌గా మారిన రాజ్‌పథ్‌పై గరిష్ఠంగా 120 ఐస్‌క్రీమ్ బండ్లు, ఆరు స్థానాల్లో తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేయొచ్చు అని ఎన్‌డీఎంసీ బుధవారం వెల్లడించింది. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) వైస్ చైర్మన్ సతీశ్ ఉపాధ్యాయ మాట్లాడుతూ, సెంట్రల్ విస్టా లాన్‌ల నుంచి ఇండియా గేట్ వరకు ఆరు వెండింగ్ జోన్లు ఉన్నట్లు తెలిపారు. ప్రతి జోన్‌లో 15 ఐస్‌క్రీమ్ ట్రాలీలు, ఐదు నీటి పంపిణీ కేంద్రాలు ఉంటాయని, మొత్తంగా 120 ఐస్‌క్రీమ్ బండ్లు, 30 నీటి కేంద్రాలను ఆరు వెండింగ్ స్థలాల్లో ఉంటాయని చెప్పారు. ఇప్పటికే వీటి నిర్వహణకు ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. ఐస్‌క్రీమ్ బండ్లను ఏర్పాటు చేసేందుకు వాణిజ్య లైసెన్సులు జారీ చేసినట్లు ఎన్‌డీఎంసీ ఉత్తర్వులు పేర్కొన్నాయి. దక్షిణ సి-హెగ్జాగాన్ రోడ్డు, ఉత్తర సి-హెగ్జాగాన్ రోడ్డు, దక్షిణ మాన్ సింగ్ రోడ్డు (రెండు వైపులు), దక్షిణ రఫీ అహ్మద్ రోడ్డు, ఉత్తర రఫీ అహ్మద్ రోడ్డులో ట్రాలీలు పెట్టే అనుమతి ఉంది. ఆ ప్రాంతాల పర్యవేక్షణ కోసం పౌరరక్షణ వలంటీర్ల (సీడీవీలు)ను మోహరించాలని జిల్లా మెజిస్ట్రేట్‌లకు ఎన్‌డీఎంసీ సూచించింది. లైసెన్సు నంబర్లు కలిగిన బండ్లను మాత్రమే వెండింగ్ జోన్‌లలో పెట్టేలా అధికారులు చూసుకుంటారని ఉపాధ్యాయ చెప్పారు. కర్తవ్యపథ్‌పై ఏర్పాటు చేసిన నీటికుంటల్లోకి దూకవద్దని ప్రజలకు సూచిస్తారని, పార్కింగ్, పారిశుద్ధ్యం వంటివీ వారు చూసుకుంటారని ఆయనన్నారు.

చైనా ఆక్రమిత ప్రాంతాన్ని ఎలా స్వాధీనం చేసుకుంటారు ?

మోదీని ప్రశ్నించిన రాహుల్



న్యూఢిల్లీ : చైనా ఆక్రమణల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రశ్నలు సంధించారు. 2020 మే 5 న లడక్‌లోని పాంగోంగ్ సరస్సు ప్రాంతంలో రెండు దేశాల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణలను ప్రస్తావిస్తూ ఎటువంటి ప్రతిఘటన లేకుండా దేశ భూభాగంలోని 1,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ప్రధాని మోదీ చైనాకు ఇచ్చేశారని ఆరోపించారు. పోగొట్టుకున్న భూభాగాన్ని తిరిగి ఎలా పొందుతారో సమాధానం చెప్పాలని బుధవారం చేసిన ట్వీట్‌లో ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో ఏప్రిల్ 2020 నాటికి ముందున్న స్థితిని పునరుద్ధరించాలనే భారతదేశం డిమాండును చైనా అంగీకరించలేదని. పోరాటం చేయకుండానే మోదీ ప్రభుత్వం1,000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని చైనాకు అప్పగించేశారని పేర్కొన్నారు. కోల్పోయిన భారత భూభాగాన్ని ఎలా తిరిగి పొందాలని భావిస్తున్నారో వివరించాలని డిమాండు చేశారు.

శైలేంద్ర, ఆనంద్-మిలింద్‌కు లతామంగేష్కర్ పురస్కారాలు

ఇండోర్: మధ్యప్రదేశ్ ప్రభుత్వం... ప్రముఖ నేపథ్య గాయకుడు శైలేంద్ర సింగ్, సంగీత స్వరకర్తలు ఆనంద్-మిలింద్‌కు లతా మంగేష్కర్ జాతీయ పురస్కారాలను ప్రకటించింది. దివంగత దిగ్గజ గాయని లతా మంగేష్కర్ జన్మదినమైన సెప్టెంబర్ 28న ఆమె జన్మస్థలం ఇండోర్‌లో పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు సంబంధిత అధికారి బుధవారం తెలిపారు. సంగీత రంగంలో నిష్ణాతులను ప్రోత్సహించేందుకు మధ్యప్రదేశ్ సాంస్కృతిక శాఖ ఏటా ఈ పురస్కారాన్ని అందజేస్తుంది. దీని కింద రూ.రెండు లక్షల నగదు, ప్రశంసా పత్రాన్ని బహూకరిస్తారు. విలక్షణ స్వరానికి ప్రసిద్ధి గాంచిన శైలేంద్ర సింగ్‌కు 2019 సంవత్సరానికి లతా మంగేష్కర్ పురస్కారం అందజేస్తారు. 1970-80లలో ఈయన పాడిన పాటలు అమిత ప్రజాదరణ పొందాయి. ఇక 200 చిత్రాలకు పైగా సంగీతాన్ని అందించిన ఆనంద్-మిలింద్ ద్వయానికి 2020 సంవత్సరానికి గాను లతా మంగేష్కర్ అవార్డును అందజేయనున్నారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం చివరిసారిగా ఫిబ్రవరి 7, 2020న లతా మంగేష్కర్ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. కోవిడ్-19 కారణంగా ఆ తర్వాత నిర్వహించబడలేదు. దిగ్గజ గాయని లతా మంగేష్కర్ సెప్టెంబర్ 28, 1929న ఇండోర్‌లో జన్మించారు. ఆమె ఫిబ్రవరి 6, 2022న ముంబైలో కన్నుమూశారు.

ఆరు వారాల్లోగా బంగ్లా ఖాళీ చేయండి

సుబ్రమణ్య స్వామికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : రాజ్యసభ సభ్యునిగా ఉన్న సమయంలో కేంద్రం కేటాయించిన బంగ్లాను ఖాళీ చేయాలని బీజేపీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రహ్మణ్య స్వామిని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈ ఏడాది ఏప్రిల్ 24న ఆయన పదవీకాలం పూర్తయింది. బంగ్లా కేటాయింపు ఐదేళ్లకే జరిగిందని, ఆ గడువు ముగిసిందని, ఆరు వారాల్లోగా ఎస్టేట్ అధికారికి అప్పగించాలని న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఆదేశించారు. జడ్ కేటగిరీ భద్రతతో కూడిన ప్రభుత్వ వసతిని కేటాయించాలని ఆదేశించే ఏ వివరాలను కోర్టుకు చూపలేదని న్యాయమూర్తి అన్నారు. 2016 జనవరి 15న తనకు కేటాయించిన అదే బంగ్లాను మళ్లీ కేటాయించాలంటూ స్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. భద్రతాపరమైన బెదిరింపుల దృష్ట్యా అప్పటి నుంచి అక్కడే నివాసం ఉంటున్నారు. 'ఈ పరిశీలనతో రిట్ పిటిషన్ పరిష్కారమయింది. నేటి నుంచి ఆరు వారాల వ్యవధిలో సంబంధిత ఎస్టేట్ అధికారికి బంగ్లాను అప్పగించాలని పిటిషనర్ (స్వామి)ని కోర్టు ఆదేశిస్తుంది' అని న్యాయమూర్తి చెప్పారు. జెడ్ కేటగిరీ భద్రతకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని, వాస్తవానికి అతనికి కేటాయించిన వసతిని అతనికి అనుకూలంగా కొనసాగించాలని స్వామి తరపు న్యాయవాది అభ్యర్థించారు. ప్రభుత్వం తరపు న్యాయవాది అదనపు సొలిసిటర్ జనరల్ సంజయ్ జైన్ తన వాదనలను వినిపిస్తూ, స్వామికి జడ్ కేటగిరీ భద్రత కొనసాగుతున్నప్పటికీ, అటువంటి సంరక్షకులను నియంత్రించే విధానాలు, మార్గదర్శకాలు సాధారణ పూల్ నుంచి నివాస వసతిని కూడా అందించడానికి ప్రభుత్వం బాధ్యత వహించదని అన్నారు. కాలానుగుణ సమీక్షకు లోబడి పిటిషనర్‌కు జడ్ కేటగిరీ రక్షణను కేంద్ర ప్రభుత్వం పొడిగించడాన్ని కొనసాగిస్తుందని, అయితే బంగ్లాను స్వామికి తిరిగి కేటాయించడం సాధ్యం కాదని ఆయన అన్నారు. స్వామి తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది జయంత్ మెహతా మాట్లాడుతూ ఆయనకు ఉన్న భద్రతాపరమైన ముప్పును దృష్టిలో ఉంచుకుని, ఆయనతో పాటు వచ్చే భద్రతా సిబ్బందికి ఎల్లవేళలా వసతి కల్పించేందుకు బంగ్లా అవసరమని అన్నారు.

లోయలో పడ్డ మినీ బస్సు

- 11 మంది దుర్మరణం, 25 మందికి గాయాలు
- జమ్ముకశ్మీర్‌లో ఘటన

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 11 మంది మృతి దుర్మరణం పాలవ్వగా, మరో 25 మంది గాయపడ్డారు. పూంచ్ జిల్లా సావ్జియాన్ నుంచి మండీ వెళ్తున్న మినీబస్సు లోయలోకి బోల్తా పడడంతో బస్సులో ప్రయాణిస్తున్న 11మంది మరణించారు. ప్రమాదంలో గాయపడిన వారిని మండీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు మండీ తహసీల్దార్ లతీఫ్ మీడియా కి చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 36 మంది ప్రయాణీకులున్నారు. ఆర్మీ, పోలీసులు, స్థానికులు ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదంపై జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.లక్ష పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

పూంచ్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేల చొప్పున ప్రధాని పరిహారం ప్రకటించారు. రోడ్డు ప్రమాదంలో 11మంది ప్రాణాలు కోల్పోవడంపై ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌కర్, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

కోరుకుంటేనే విద్యుత్ సబ్సిడీ: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: కోరుకున్న వారికే విద్యుత్ సబ్సిడీ అందజేస్తామని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. విద్యుత్ సబ్సిడీ పొందేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. బుధవారం నుంచి ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కేజ్రీవాల్ బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉచిత విద్యుత్ పథకం కింద సబ్సిడీ పొందేందుకు 7011311111 నంబర్‌కు వాట్సాప్ సందేశం లేదా మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. రాజధాని నగరంలోని అనేకమంది విద్యుత్ సబ్సిడీ వదులుకునేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీ కోరుకునే వారు మిస్డ్ కాల్ ఇవ్వగానే దరఖాస్తు ఫారం వాట్సాప్‌లో వస్తుందని, సబ్సిడీ కోరుతూ వారు దానిని పూర్తి చేసి పంపాలని తెలిపారు. అక్టోబరు 31 లోగా దరఖాస్తు చేసుకున్న వారు సబ్సిడీ పొందుతారని చెప్పారు. ప్రతినెలా సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకునే వారు బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. 400 యూనిట్ల లోపు వినియోగదారులు 50శాతం సబ్సిడీ పొందుతున్నారు. 2020లో ఆప్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేజ్రీవాల్ ఆఫ్‌లైన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం ఇదేమొదటిసారి. కోవిడ్ కష్టకాలంలో ఆన్‌లైన్ ద్వారానే ఆయన మీడియాతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్నారు. సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు భౌతికంగానూ, ఎలక్ట్రానిక్ పద్ధతిలోనూ అవకాశం కల్పించినట్లు కేజ్రీవాల్ వివరించారు.

నిరసన పేరుతో బీజేపీ విధ్వంసకాండ

కోల్‌కతా: పేరుకు జాతీయ పార్టీ. పైగా కేంద్రంలో అధికారంలో కూడా ఉంది. దేశంలో, రాష్ట్రాల్లో శాంతి భద్రతలు కాపాడాల్సింది పోయి విధ్వంసానికి పాల్పడింది. బీజేపీ నేతలు బెంగాల్ రాజధాని కోల్‌కతాలో మంగళవారం ప్రవర్తించిన తీరు వీధి రౌడీలను తలపించిందని నెటిజన్లు మండిపడుతున్నారు. బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి, బీజేపీ హుగ్లీ ఎంపీ లాకెట్ చటర్జీ, పార్టీ సీనియర్ నేత రాహుల్ సిన్హా తదితరులు అధికార టీఎంసీవి అవినీతి విధానాలంటూ సచివాలయ ముట్టడికి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు ఏకంగా పోలీసులపైనే దౌర్జన్యానికి దిగారు. పోలీసు వాహనాలతోపాటు ఇతర వాహనాలకు నిప్పు పెట్టారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. మరీ ముఖ్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా వచ్చి వెళ్లాక పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ విధ్వంస కాండలో పోలీసు అధికారులకు గాయాలయ్యాయి. పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లను దాటుకొంటూ బీజేపీ నేతలు ముందుకు సాగుతూ, పోలీసులతోనే ఘర్షణకు దిగారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు జల ఫిరంగులు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. హౌరా బ్రిడ్జి, ఎంజీ రోడ్డు, లాల్‌బజార్ ప్రాంతాల్లోనూ బీజేపీ కార్యకర్తలు విధ్వంసాలకు తెగబడ్డారు. లాల్‌బజార్‌లో పోలీస్ వాహనానికి నిప్పుపెట్టారు. ఈ ఘటనల్లో చాలా మంది పోలీసులు గాయపడ్డారని ఓ పోలీస్ అధికారి తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ చేయి విరిగిందని చెప్పారు. బీజేపీ కార్యకర్తలు విధ్వంసానికి దిగటంతో సామాన్య ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురైనట్టు పేర్కొన్నారు. బెంగాల్‌లో బీజేపీ కార్యకర్తలు సృష్టించిన విధ్వంసం దేశానికి తలవంపులు తెచ్చిందని, ఇలాంటి దారుణమైన ప్రవర్తనను ఖండిస్తున్నట్టు టీఎంసీ ట్విట్టర్‌లో తెలిపింది.

రాణి ఎలిజబెత్ అంత్యక్రియలకు రాష్ట్రపతి

న్యూఢిల్లీ: బ్రిటన్ రాణి ఎలిజబెత్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సెప్టెంబరు 17న లండన్ వెళుతున్నారు. భారత ప్రభుత్వం తరపున ఆమె సంతాపం ప్రకటిస్తారు. ఈ విషయాన్ని విదేశీ మంత్రిత్వశాఖ బుధవారం వెల్లడించింది. సెప్టెంబరు 8వ తేదీన రాణి ఎలిజబెత్-2 మరణించారు. ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధాని నరేంద్రమోదీ ఆమెకు ఘన నివాళి అర్పించారు. భారత్ తరపున నివాళి అర్పించేందుకు సెప్టెంబరు 12న విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ బ్రిటీష్ హైకమిషన్‌కు వెళ్లారు. ఎలిజబెత్ మృతికి నివాళిగా భారతదేశం ఆదివారం సంతాప దినంగా పాటించింది.

గోదాముల కార్మికులకు ప్రభుత్వ ప్రయోజనాలు

న్యూఢిల్లీ: తమ సభ్యులకు ప్రభుత్వ ప్రయోజనాలు కల్పించడానికి సంబంధించిన ప్రణాళికపై రైల్వే గోదాముల వర్కర్స్ యూనియన్ కసరత్తు చేస్తోంది. వేర్‌హౌస్ కార్మికులను అసంఘటిత రంగ కార్మికులుగా ప్రభుత్వం గుర్తించడంతో..వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయనే అంశాలపై చర్చిస్తోంది. గోదాముల కార్మికులను ఆ-శ్రమ పోర్టల్ జాబితాలో చేర్చడానికి ప్రయత్నిస్తోంది. అసంఘటితరంగ కార్మికులను ప్రభుత్వ పథకాల పరిధిలోకి తీసుకురావడానికిగాను కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ పథకాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఈ రంగంలో 7.50లక్షల కార్మికులు పనిచేస్తున్నారు. వారు ర్యాకులు, వ్యాగన్ల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తుంటారు. భారతదేశంలో ప్రతి రైల్వే గూడ్స్‌షెడ్‌లో పనిచేసే కార్మికులకు ప్రభుత్వ పథకాలు లభించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై భారతీయ రైల్వే మాల్ గోదాం శ్రామిక యూనియన్ ఇటీవల సమావేశమై చర్చించింది. వేర్‌హౌస్ కార్మికులు సుదీర్ఘకాలంగా తమ హక్కులు, ప్రయోజనాల కోసం డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-శ్రమ పోర్టల్‌లో ఆ కార్మికుల నమోదుకు కేంద్రం అంగీకరించడం గొప్ప ముందడుగని వేర్‌హౌస్ వర్కర్స్ ప్రతినిధి పరిమళ్ కాంతి మండల్ చెప్పారు.

వామపక్ష నేతలపై కేరళ కోర్టు అభియోగాలు

తిరువనంతపురం: ఏడేళ్ల క్రితం అసెంబ్లీలో గందరగోళం సృష్టించరాన్న ఆరోపణలపై కేరళ విద్యాశాఖమంత్రి వి.శివన్‌కుట్టి, మరికొంతమంది ఎల్‌డీఎఫ్ నాయకులపై కేరళ కోర్టు బుధవారం అభియోగాలు నమోదు చేసింది. శివన్‌కుట్టి, వామపక్ష ఎమ్మెల్యే కేటీ జలీల్, మాజీ ఎమ్మెల్యేలు కె.అజిత్, సీకే సదాశివన్, కె.కున్హమ్మద్‌లపై అభియోగాలను చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ చదివి వినిపించారు. కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 26కి వాయిదా వేశారు. ఈ విషయాలను ఫిర్యాదు తరపు న్యాయవాది మృదుల్ మ్యాథ్యూ బుధవారం తెలిపారు. ఆరుగురు నిందితులపై సెక్షన్ 447, 427, రెడ్‌విత్ 34 కింద అభియోగాలు నమోదు చేశారు. ఈ కేసు నుంచి లెఫ్ట్ ఫ్రంట్ నాయకులకు విముక్తి కల్పించాలన్న అభ్యర్థనను కాంగ్రెస్ సీనియర్ నేత రమేశ్ చెన్నితల వ్యతిరేకించారు.

పని పరిస్థితులు మెరుగవ్వాల్సిందే... : యాదవ్

న్యూఢిల్లీ : దేశంలో కార్మికుల పని పరిస్థితులను మెరుగుపర్చితేనే కోవిడ్ నుంచి కోలుకున్నట్లు అవుతుందని కేంద్ర కార్మికశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ నొక్కిచెప్పారు. ఆయన బుధవారం ఇండోనేసియాలోని బాలీలో నిర్వహించిన జీ20 కార్మిక-ఉపాధి మంత్రిత్వశాఖల సమావేశంలో మాట్లాడారు. మహమ్మారి అన్ని దేశాలను చాలా విధాలుగా దెబ్బతీసింది. అందులో నుంచి కోలుకునేందుకుగాను ఉపాధి సృష్టి, సామాజిక భద్రత, నైపుణ్యత, అధికారికీకరణ సంబంధించి పటిష్ఠ ప్రతిస్పందక విధానాల దిశగా దేశాల ఏకీకరణ ముఖ్యమన్నారు. సమాన-సుస్థిర పునరుద్ధరణ అవశ్యమని అన్నారు. ప్రపంచ శ్రామిక నేపథ్య కీలక క్షేత్రాలపై ఇండోనేసియా దృష్టి పెట్టిందని ప్రశంసించారు. దివ్యాంగులకు సంబంధించి కార్మిక విపణి ఏకీకరణ, సుస్థిరాభివృద్ధి, మానవ సామర్థ్యంలో వృద్ధి-ఒకేషనల్ శిక్షణ ఆధారిత స్థిరీకరణతో పాటు ఎస్ఎంఈ రంగంలో ఉద్యోగాల సృష్టి, కార్మిక పరిరక్షణ వంటి రంగాల్లో భారత్ గొప్ప విజయాలు సాధించిందని యాదవ్ అన్నారు. ఆయన అనంతరం జర్మనీ, సింగపూర్, యూఏఈ, సౌదీ అరేబియా, నెదర్లాండ్స్, టర్కీ దేశాలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.

ఎస్టీ జాబితాలోకి హిమాచల్ 'హత్తీ' వర్గం

రాజ్యాంగ సవరణ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ : హిమాచల్ ప్రదేశ్, సిర్మౌర్ జిల్లాలోని ట్రాన్స్-గిరి ప్రాంతంలో నివసించే హత్తీ వర్గీయులకు గిరిజన హోదా కల్పించి ఎస్టీల జాబితాలో చేర్చే దిశగా రాజ్యాంగ సవరణ బిల్లుకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండా విలేకరులతో మాట్లాడారు. ఎస్టీల జాబితాలో హిమాచల్ హత్తీ వర్గీయులతో పాటు చత్తీస్‌గఢ్‌లోని భింఝియా; తమిళనాడులోని నారికోరవన్, కురివిక్కారన్ వర్గీయులను చేర్చేలా రాజ్యాంగ సవరణ బిల్లులను కేబినెట్ ఆమోదించిందని చెప్పారు. రాజ్యాంగ (షెడ్యూల్డ్ తెగలు) ఆదేశం (మూడవ సవరణ) బిల్లు 2022.. చట్టం అయితే హత్తీ వర్గీయులు 1.6లక్షల మందికి ఎస్టీ హోదా లభిస్తుంది. సంబంధిత ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారు. ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్ పొందగలరు. అనంతరం కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడారు. తమను ఎస్టీల్లో చేర్చాలని 50ఏళ్లకుపైగా హిమాచల్ ప్రదేశ్ హత్తీ వర్గీయులు డిమాండు చేస్తున్నారన్నారు. ఉత్తరాఖండ్‌లోని జౌన్సర్‌లోని హత్తీ వర్గీయులకూ గిరిజనుల హోదా కల్పించినట్లు తెలిపారు. ఇది చరిత్రాత్మక నిర్ణయమని, ఇందుకోసం ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన చెప్పారు. బింఝియా వర్గీయులు 15ఏళ్లకుపైగా ఎస్టీ హోదా కోరుతున్నారన్నారు. కర్ణాటకలోని 'కాదు కురుబా' (బెట్టా-కురుబా వర్గాని)కీ ఎస్టీ హోదా కల్పనకూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రులు చెప్పారు.

ప్రధాని మోదీతో భూటాన్ రాజు భేటీ

న్యూఢిల్లీ : భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్ చుక్ బుధవారం ఇక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ద్వైపాక్షిక సంబంధాలు, వాటిని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇద్దరు నేతలు చర్చించినట్లు భావిస్తున్నారు. క్వీన్ ఎలిజబెత్-2 అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వాంగ్‌చుక్ లండన్ వెళ్లే మార్గంలో భారత్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. భారతదేశం, భూటాన్ చారిత్రాత్మకంగా బలమైన సంబంధాలను కలిగి ఉన్నాయి. కాగా వాంగ్‌చుక్ విదేశాంగ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రాను కూడా కలిశారు.

బ్యాంకు మోసం కేసులో...

రూ.47 కోట్ల విలువైన బంగారం, వెండి స్వాధీనం

: బ్యాంకులను మోసం చేసి భారీగా రుణాలు పొంది మోసం చేసిన కేసులో పరేఖ్ అల్యూమినెక్స్, రక్షా బులియన్ సంస్థకు చెందిన రహస్య లాకర్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. లాకర్ల నుంచి రూ.47 కోట్లకు పైగా విలువైన 431 కిలోల బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ ఒక ప్రకటన విడుదల చేసింది. పరేఖ్ అల్యూమినెక్స్ లిమిటెడ్ కంపెనీ వివిధ బ్యాంకులను మోసం చేసి రూ.2,296 కోట్లను రుణాలుగా పొందినట్టు 2018లో మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి ఈడీ విచారణలో భాగంగా ఆ కంపెనీ కొన్ని ప్రైవేటు లాకర్లను నిర్వహిస్తున్నట్టు కనుగొన్న అధికారులు సోదాలు నిర్వహించారు. రెండు లాకర్లలో 91.5 కిలోల బంగారం కడ్డీలు, 152 కిలోల వెండిని గుర్తించినట్టు ఈడీ తెలిపింది. రక్షా బులియన్‌కు చెందిన లాకర్లలో 188 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి విలువ రూ.47.76 కోట్లుకు పైగా ఉంటుందని వెల్లడించింది. ఇదిలా ఉండగా ఈ కేసుకు సంబంధించి 2019లోనే రూ.205 కోట్లకు పైగా ఆస్తులను జప్తు ఈడీ చేసిన విషయం తెలిసిందే.

ఎయిర్ ఇండియా విమానంలో పొగలు

ప్రయాణికుల పరుగులు

మస్కట్: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం నుంచి పొగలు రావడం కలకలం రేపింది. ఒమన్ రాజధాని మస్కట్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కొచ్చికి బయల్దేరేందుకు సిద్ధమవుతున్న బోయింగ్ 737-800 విమానం రన్‌వేపై ఉన్న సమయంలోనే ఇంజిన్ నుంచి పొగలు వ్యాపించడంతో అంతా ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను హుటాహుటిన విమానం నుంచి కిందకు దించేయడంతో పెను ప్రమాదం తప్పింది. భయంతో ప్రయాణికులు పరుగులు తీసిన దృశ్యాలు వీడియోలో రికార్డయ్యాయి. ఈ ఘటనలో14మందికి గాయాలైనట్టు సమాచారం. ప్రమాదం సమయంలో విమానంలో 141 మంది ప్రయాణికులు ఉండగా.. వీరిలో నలుగురు శిశువులు ఉన్నారు. అలాగే, మరో ఆరుగురు విమాన సిబ్బంది కూడా ఉన్నారు. ప్రయాణికులందరినీ ఖాళీ చేయించిన విమానాశ్రయ సిబ్బంది వారిని సురక్షితంగా టెర్మినల్ భవనంలోకి తరలించారు. మరోవైపు, మస్కట్ నుంచి కొచ్చికి ప్రయాణికులను తరలించేందుకు మరో విమాన సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్టు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారులు వెల్లడించారు.

ఏకాభిప్రాయానికి యత్నిస్తాం

- కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నికపై జైరాం రమేశ్
- అధిష్ఠానం లేని పార్టీ అస్తవ్యస్థమవుతుందని వ్యాఖ్య

తిరువనంతపురం: కాంగ్రెస్ నూతన అధ్యక్షుడి విషయంలో పార్టీలో ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తామని సీనియర్ నేత జైరాం రమేశ్ అన్నారు. నెహ్రూ–గాంధీ కుటుంబం ప్రాధాన్యత వ్యవస్థాగత వ్యవహారాల్లో తగ్గబోదన్నారు. ఏఐసీసీ కొత్త అధ్యక్షుడిగా అర్హుడైన వ్యక్తి ఎంపికపై ఏకాభిప్రాయం దిశగా కృషి చేస్తామని కుదరని పక్షంలో ముందు ప్రకటించినట్టే అక్టోబరు 17న ఎన్నిక జరగుతుందని అన్నారు. అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికైనాగానీ పార్టీ పెద్దగా సోనియాగాంధీకి గౌరవం ఉంటుందని, పార్టీకి సైద్ధాంతిక దిక్సూచిగా రాహుల్ గాంధీ ఉంటారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ నొక్కిచెప్పారు. అధిష్ఠానం ఉండే సంస్కృతి పోవాలన్న వాదననూ తోసిపుచ్చారు. అధిష్ఠానం లేకపోతే పార్టీ అస్తవ్యస్థంగా మారుతుందని వ్యాఖ్యానించారు. బ్రిటన్‌లోని పార్టీల తరహాలో భారత్‌లోని రాజకీయ పార్టీలు ఉండాలన్న వారికి దేశ వాస్తవ పరిస్థితులపై అవగాహన లేదనే భావించాల్సి ఉంటుందని అన్నారు. కొత్త అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవంగా జరగాలని ఆకాంక్షించారు.తెరవెనుక 'అధ్యక్షుడిగా' రాహుల్ పనిచేస్తారన్న విమర్శలను కొట్టిపారేశారు. రాహుల్‌ది ప్రజాస్వామ్యబద్ధ వ్యక్తిత్వమని చెప్పారు. ఐఎన్‌సీ చరిత్రలో ఏకాభిప్రాయం ద్వారానే ఎన్నికలు జరుగుతాయని 1938, 1950, 1997, 2000 ఎన్నికలను గుర్తుచేశారు. ఈ విషయంలో తాను మాత్రం సీనియర్ నేత కామరాజ్ చూపిన మార్గాన్నే అనుసరిస్తానన్నారు. అధ్యక్ష పదవికి ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేస్తేనే కాంగ్రెస్‌కు పునరుజ్జీవం లభిస్తుందని లోక్‌సభ ఎంపీ శశిథరూర్‌తో సహా పార్టీలోని ఒక వర్గం నేతల వాదనపై స్పందిస్తూ ఏకాభిప్రాయం సాధ్యం కాకపోతే ఎన్నికలు జరగాల్సిందేనని జైరాం రమేశ్ అన్నారు. థరూర్ కూడా పోటీ చేయొచ్చు. ఇది ప్రజాస్వామిక పద్ధతి. అధ్యక్ష పదవి కోసం ఎన్నికలు నిర్వహించే ఏకైక పార్టీ మాది అని ఆయనన్నారు. అధ్యక్ష పదవికి పోటీ చేయాలా లేదా అన్నది రాహుల్ నిర్ణయించుకోవాలి అని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. రాహుల్ విచిత్ర పరిస్థితిలో ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్నారా? మీరు అభ్యర్థినా? అని అడుగుతున్న వారే నామినేషన్లు ముగిసే సమయానికి ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నిస్తారు' అని జైరాం రమేశ్ అన్నారు. రాహుల్ భారత్ జోడో యాత్రపైనే దృష్టిని కేంద్రీకరించారన్నారు. వ్యవస్థాగత ఎన్నికలపై రెండు–మూడు సార్లు రాహుల్‌తో చర్చించినప్పుడు ఎన్నికలు ఎందుకని నిర్వహించరాదు? ప్రజలు ఎందుకు పోటీ చూయకూడదు? అని ఆయన ప్రశ్నించారని రమేశ్ చెప్పారు. ప్రజలు పోటీ చేయాలని అనుకుంటే నామినేషన్ దాఖలు చేసుకోవచ్చు అని అన్నారు. 'అధిష్ఠాం' సంస్కృతి పోవాలన్న వాదనలను తోసిపుచ్చారు. బీజేపీకి అధిష్ఠానం లేదనుకుంటున్నారా? సీపీఎంకూ అధిష్ఠానం లేదా? ప్రతి ఒక్క పార్టీకి హైకమాండ్ ఉంటుంది. ప్రతి పార్టీలో కొందరు పెద్దలు ఉంటారు. కీలక అంశాలపై చర్చలు, సమాలోచనలు జరిపి తగు నిర్ణయాలు తీసుకుంటారు. అధిష్ఠానం లేకపోతే పార్టీ అస్థవ్యస్తమవుతుంది' అని జైరాం రమేశ్ అన్నారు. నెహ్రూ–గాంధీ కుటుంబం నుంచి కాకుండా వేరొకరు అధ్యక్ష బాధ్యతలు చేపడితే కాంగ్రెస్‌కు అధిష్ఠానం ఎవరన్న ప్రశ్నకు 'ఇది హైపోథెటికల్ ప్రశ్న. సోనియాగాంధీ, రాహుల్‌కు గౌరవం అలాగే ఉంటుంది. ప్రజల చూపు వారి వైపే ఉంటుందని భావిస్తున్నాను' అని జైరాం రమేశ్ బదులిచ్చారు. వేరేవాళ్లు వచ్చినాగానీ సోనియాగాంధీగానీ రాహుల్‌గాంధీ నుంచి ఎలాంటి ఒత్తిళ్లుగానీ ఆందోళనకర పరిస్థితులుగానీ ఉండవని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్నది భారత్ జోడో యాత్రయేగానీ కాంగ్రెస్ జోడో యాత్ర కాదన్నారు.' ఇది కాంగ్రెస్ శక్తి. అందరిలో నూతనోత్సాహాన్ని నింపుతోంది. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతోంది' అని జైరాం రమేశ్ అన్నారు. ఇది చిన్న యాత్ర కాదని, 150 రోజుల్లో 3,600 కిమీలు సాగే పాదయాత్ర అని, ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ ఇలాంటివి చేపట్టలేదని జైరాం రమేశ్ నొక్కిచెప్పారు. కాగా, కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలకు నోటిఫికేషన్ ఈనెల 22న విడుదల కానుంది, నామినేషన్ ప్రక్రియ 30వ తేదీ వరకు సాగుతుంది. అక్టోబరు 17న ఓటింగ్ – ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎక్కువ మంది ఉంటే 19న ఫలితాలు వెలువడతాయి.

పెట్రోలు బంకుల్లో తనిఖీలు

- 29 కేసులు నమోదు
- పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: పల్నాడు, తిరుపతి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని పెట్రోలు బంకుల్లో తూనికలు కొలతల శాఖ అధ్వర్యంలో తనిఖీలు నిర్వహించినట్టు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన బంకులపై 29 కేసులను నమోదు చేసినట్టు వెల్లడించారు. అమరావతిలోని సచివాలయం నాల్గవ బ్లాకు ప్రచార విభాగంలో బుధవారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...పెట్రోలు బంకుల్లో అక్రమాలను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ మూడు జిల్లాల్లోని పెట్రోల్ బంకుల్లో అక్రమాలకు సంబంధించి తూనికలు కొలతలు శాఖ అధికారులు దాడులు నిర్వహించి 29 కేసులను నమోదు చేసి రూ.70వేల నుంచి 3లక్షల వరకూ జరిమాన విధించిందని వివరించారు. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లోని వివిధ మాల్స్‌లోనూ తనిఖీలు చేపట్టి 156 కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఇతర పట్టణాల్లోనూ పెద్దఎత్తున తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. సీఎం యాప్ ద్వారా రాష్ట్రంలోని స్థానిక మార్కెట్లు, రైతు బజార్ తదితర మార్కెట్లలో నిత్యావసర సరుకుల ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. రాష్ట్ర తూనికలు కొలతలు శాఖ సంయుక్త కంట్రోలర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ మూడు జిల్లాల్లోని పెట్రోల్ బంకుల్లో కొన్ని సాంకేతిక పారామీటర్ల ప్రకారం తనిఖీలు నిర్వహించామని, మిగతా 23 జిల్లాల్లో ఆరు నెలల్లోగా తనిఖీలు పూర్తి చేస్తామన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన జేవీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర–విశాఖ: విజయవాడలో అక్టోబర్ 14 నుంచి 18 వరకు జరగనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారా యణమూర్తి పిలుపునిచ్చారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యాలయంలో జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి సీపీఐ అనేక ఉద్యమాలలో కీలకపాత్ర పోషించిందని, బ్రిటీష్ వలస పాలనకు, జమిందారీ, జాగీర్దారీ విధానా లకు వ్యతిరేకంగా, సంస్థానాల రద్దు, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, సామాజిక న్యాయం, బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని పోరు సల్పిందని గుర్తుచేశారు. నిషేధాలను, నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా సామ్రాజ్య వాద ఉక్కుపాదంపై సీపీఐ కన్నెర్రజేసిందన్నారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా 'దున్నే వాడికే భూమి దక్కాలనే' నినాదంతో చారిత్రక భూపోరాటాలు చేసిందని, లక్షలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐకి దక్కుతుం దని ఆయన అన్నారు. మితవాద, ఫాసిస్టు, మతో న్మాద శక్తులు పెచ్చరిల్లుతున్నాయని, ముఖ్యంగా నరేంద్రమోదీ అధికారం చేపట్టాక ప్రజాకంటక విధానాలు యధేచ్ఛగా అమలు చేస్తున్నారని విమ ర్శించారు. ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నా రని, మతోన్మాదం పెచ్చరిల్లుతోందని మండి పడ్డారు. సరళీకరణ, ప్రైవేటీకరణ పేరిట ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న సీపీఐ జాతీయ మహా సభలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నా యని, వాటి జయప్రదానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాసరావు, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ నేతలను అడ్డుకున్న పోలీసులు

లక్నో: ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రాష్ట్రంలో శాంతిభద్రతలకు వ్యతిరేకంగా శాసనసభలో సమాజ్‌వాదీ పార్టీ చేపట్టాలనుకున్న ప్రణాళికాబద్ధమైన నిరసన బుధవారం ప్రారంభం కాలేదు. పోలీసులు ఎస్పీ నాయకులను ఘటనా స్థలానికి చేరుకోకుండా అడ్డుకున్నారు. షెడ్యూల్ నిరసనకు గంటల ముందు లక్నోలోని ఎస్పీ కార్యాలయం, ఆ పార్టీ నాయకుల నివాసాల వెలుపల పోలీసు సిబ్బంది నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. హజ్రత్‌గంజ్‌లోని శాసనసభ దగ్గర కూడా పోలీసులు భారీగా మోహరించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పీయూష్ మోర్డియా ఎస్పీ కార్యాలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ, "శాసనసభ వద్ద నిరసన ప్రదర్శన చేయడానికి అనుమతి లేదు. నిరసనకారులను ఎకో–గార్డెన్‌కు తీసుకెళ్తున్నారు, ఇది నగరంలో నిరసనల కోసం నియమించబడిన ప్రదేశం' అని తెలిపారు. అయితే ఈ చర్యలను పార్టీ నాయకులు వ్యతిరేకించారు. 'ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం మానేయాలని. శాసనసభలో ప్రజాప్రయోజన సమస్యలను లేవనెత్తుతూ నిరసనలకు దిగుతున్న ఎస్పీ ఎమ్మెల్యేలను పోలీసులు ఇళ్ల నుంచి బయటకు రానివ్వలేదు. ఇప్పు డు ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాను కూడా ఎమ్మెల్యేలతో మాట్లాడ కుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. ఇది దారుణం'అని పార్టీ ట్వీట్ చేసింది. సెప్టెంబరు 14 నుంచి 18 వరకు రోజూ కొన్ని గంటల పాటు నిరసనలు చేపట్టాలని ఎస్పీ మంగళవారం ప్రకటించింది. సెప్టెంబర్ 18 వరకు వివిధ రోజుల్లో సీనియర్ నాయకులు నిరసనకు నాయకత్వం వహిస్తారని పేర్కొంది. సెప్టెంబర్ 19 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

భారత్ దృక్పథం విస్తరణవాదం కాదు

న్యూఢిల్లీ: భారతదేశ దృక్పథం ఎన్నడూ విస్తరణవాదం కాదని, 'వసుధైక కుటుంబం' అనే భావన దాని నాగరికత ప్రధాన విలువను సూచిస్తుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ బుధవారం అన్నారు. ఇక్కడి నేషనల్ డిఫెన్స్ కాలేజీ (ఎన్‌డీసీ)లో 'భారతదేశ ప్రధాన విలువలు, ఆసక్తులు, లక్ష్యాలు' అనే అం శంపై ఆయన ప్రసంగిస్తూ... రాజ్యాంగ ప్రవేశికలో మన ప్రధాన విలువలు అనేకం ఉన్నాయని ఉప రాష్ట్రపతి అన్నారు. 'వాక్సిన్ మైత్రి' కార్యక్రమాన్ని ప్రస్తా విస్తూ... భారతదేశం ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా పరిగణిం చదాన్ని విశ్వసిస్తుందని అన్నారు. భారతదేశంలో వ్యూహాత్మక అభ్యాసానికి అత్యంత బలీయమైన కేంద్రాలలో ఒకటిగా స్థిరపడినందుకు ఎన్‌డీసీని ప్రశంసిస్తూ, ఈ గొప్ప సంస్థ గత ఆరు దశాబ్దాలుగా అంతర్జాతీయంగా దాని ఖ్యాతి, ఔన్నత్యాన్ని రెండింటినీ పెంచుకుందని ధన్కర్ అన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు అనుమతి తప్పనిసరి

కమిషన్ చైర్‌పర్సన్ అప్పారావు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: బాలల సంరక్షణ కేంద్రాలకు ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు ఆదేశించారు. కమిషన్ కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. బాలల న్యాయచట్ట ప్రకారం 18 ఏళ్లలోపుగల నిరాదరణకు గురైన బాలలను వసతి గృహాలలో చేర్పించే ముందు తప్పని సరిగా ఆయా జిల్లాలకు సంబంధించిన బాలల సంక్షేమ సమితి వారి ఆదేశాలతోపాటు జిల్లా అధికారులచే ధృవీకరించిన లైసెన్సు విధిగా ఉండాలన్నారు. జువైనెల్ వెల్ఫేర్ డైరెక్టర్ బి.డి.వి.ప్రసాద్ మూర్తి మాట్లాడుతూ ఏ సంస్థయినా ఇటువంటి పిల్లలతో బాలల సంరక్షణ కేంద్రం నిర్వహించాలనుకుంటే బాలల న్యాయచట్టం, సెక్షన్ 41 నియమ, నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కమిషన్ సభ్యులు జె.రాజేంద్ర ప్రసాద్, జి.సీతారాం, టి.ఆదిలక్ష్మీ, బి.పద్మావతి, ఎం.లక్ష్మీదేవి, కమిషన్ కార్యదర్శి టీవీ శ్రీనివాస్ ప్రోగ్రాం ఆఫీసర్ పద్మజ, మునిరాజు, లక్ష్మీ, అరుణ పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉచిత వసతి పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: హైదరాబాద్ నుంచి ఏపీ రాజధాని ప్రాంతానికి వచ్చి పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల ఉచిత వసతి సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో సారి పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వం అప్పటివరకు హైదరాబాద్‌లో ఉంటున్న సచివాలయ, ఇతర శాఖల ఉద్యోగులను ఏపీకి తీసుకురావడానికి వారికి అనేక ప్రోత్సాహకాలు ప్రకటించింది. దీనిలో భాగంగా వారికి ఉచిత వసతి సౌకర్యంతోపాటు, వారానికి ఐదు రోజుల పని విధానం కూడా ప్రవేశపెట్టింది. అలాగే కేవలం హైదరాబాద్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఒక రైలు కూడా ఏర్పాటు చేశారు. ఈ సౌకర్యాలన్నీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. దీనిలో భాగంగానే ఉద్యోగులకు కల్పిస్తున్న ఉచిత వసతి సదుపాయం 2023 జూన్ 26వరకు పొడిగిస్తున్నట్లు సాధారణ పరిపాలన ఉత్తర్వులిచ్చింది. శాసనసభ, హెచ్‌ఓడీ కార్యాలయాలు, హైకోర్టు, రాజ్‌భవన్ ఉద్యోగులకు మాత్రమే ఈ పొడిగింపు వర్తిస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే విజయవాడ, గుంటూరు నగరాల్లో బస చేస్తున్న ఉద్యోగులకు ఉచిత వసతి సదుపాయాన్ని 2024వరకు పొడిగించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

హిందీ సరళీకృతం... అందర్నీ ఆకర్షిస్తుంది

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా దేశాన్ని గుర్తింపు తీసుకొచ్చింది హిందీనేని, ఆ భాషకున్న సరళీకృతం అందర్నీ ఆకర్షిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఓ ట్వీట్‌లో తెలిపారు. హిందీ దివస్ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశ వ్యాప్తంగా అత్యధులకు మాట్లాడే భాష కోసం కృషి చేసిన వారందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హిందీ పోటీ కాదు: అమిత్‌షా

సూరత్: దేశంలో ఉన్న అన్ని భాషలకు 'హిందీ' స్నేహితుడిలాంటి వాడని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బుధవారం ప్రాంతీయ భాషలకు వ్యతిరేకంగా హిందీని ఇరికించే "తప్పుడు సమాచారం" ప్రచారాన్ని ఖండించారు. హిందీని కలిపి ప్రాంతీయ భాషలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. సూరత్‌లో అఖిల భారత అధికార భాషా సదస్సులో ప్రసంగించిన షా, భాషల సహజీవనాన్ని అంగీకరించడం అవసరమని, నిఘంటువును విస్తరించేందుకు ఇతర భాషల పదాలను తీసుకొని హిందీని అనువైనదిగా మార్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 'నేను ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. హిందీ–గుజరాతీ, హిందీ–తమిళం, హిందీ–మరాఠీలు పోటీదారులని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. హిందీ దేశంలోని మరే ఇతర భాషకు పోటీగా ఉండదు. హిందీ దేశంలోని అన్ని భాషల మిత్రుడు' అని షా అన్నారు. హిందీ భాష అభివృద్ధి చెందినప్పుడే దేశంలో ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. "అందరూ దీనిని అంగీకరించాలి, అర్థం చేసుకోవాలి. భాషల సహజీవనాన్ని మనం అంగీకరించనంత కాలం, మన సొంత భాషలో దేశాన్ని నడిపించాలనే కలను మనం సాకారం చేసుకోలేం. అది మన లక్ష్యం కావాలని నేను హృదయపూర్వకంగా చెప్పాలనుకుంటున్నాను. అన్ని భాషలను, మాతృభాషలను సజీవంగా, సుసంపన్నంగా ఉంచండి. ఈ అన్ని భాషల శ్రేయస్సుతోనే హిందీ అభివృద్ధి చెందుతుంది, "అని షా తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయండి: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలు, అవినీతి, అక్రమాలు, అరాచకపాలనపై నిలదీయాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం చంద్రబాబు అధ్యక్షతన టీడీఎల్పీ సమావేశమైంది. ఈ భేటీలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉభయ సభల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మొత్తం 18 అంశాలు లేవనెత్తేందుకు పట్టుబట్టాలని టీడీఎల్పీ నిర్ణయం తీసుకుంది. అమరావతి రాజధాని, పోలవరం, లిక్కర్ స్కామ్, నిరుద్యోగం, ఇసుక దోపిడీ తదితర ప్రజాసమస్యలపై చట్టసభల్లో లేవనెత్తేందుకు టీడీపీ వ్యూహరచన చేసింది. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకాన్నాయి. సభ మొదటి రోజే మూడు రాజధానుల అంశంపై లఘు చర్చ నిర్వహించే అవకాశం ఉన్నందున, దానిపై ప్రభుత్వ కుట్రపూరిత చర్యలను ఏ విధంగా ఎండగట్టాలనే దానిపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, శాసనసభ ఉప నాయకుడు రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిల్లు పెట్టే అధికారం లేదు: యనమల

టీడీపీఎల్పీ సమావేశం అనంతరం శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా మూడు రాజధానులపై రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ బిల్లు పెట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోందని ప్రశ్నించగా, లేని అధికారంతో అసెంబ్లీలో ఎలాంటి బిల్లు పెట్టలేరని తేల్చిచెప్పారు. రాజధాని మార్పు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదంటూ రాజ్యసభలో విజయసాయి ప్రయివేటు బిల్లు పెట్టడమే ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కాకుండా వ్యక్తి గత అజెండా మీద అధికార పార్టీ ఎక్కువగా దృష్టి సారిస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర రాజధాని అమరావతేనని హైకోర్టు స్పష్టం చేయడంతో పాటు ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వెళ్లి వచ్చిందన్నారు. న్యాయస్థానం తీర్పులను ఉల్లంఘించాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. అసెంబ్లీ సమావేశాలు రాజ్యాంగ పరంగా తప్పకుండా నిర్వహించాలి కాబట్టి పెడుతున్నారే తప్ప ప్రజాసమస్యల పరిష్కారం కోసం కాదన్నారు.

పోలవరంపై అసెంబ్లీలో చర్చిద్దాం: అంబటి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్న సందర్భంగా, పోలవరంపై చర్చించేందుకుగాను చంద్రబాబు శాసనసభకు రావాలని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు సవాల్ విసిరారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పోలవరంలో డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి చంద్రబాబే ప్రధాన కారణమని, ఆయన హయాంలో జరిగిన చారిత్రక తప్పిదాలు చేశారని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలు చర్చించడానికి కేంద్రంలో పార్లమెంట్, రాష్ట్రాల్లో శాసన సభలు ఉన్నాయన్నారు. అక్కడ ప్రజా సమస్యలపై చర్చ జరుగుతుందనీ, దానికి చంద్రబాబు సిద్ధమా? అని సవాల్ విసిరారు. అప్పటి ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమ శాసనసభకు వచ్చే అవకాశం లేదనీ, ఎందుకంటే ఆయన సభకు వెళ్లే అర్హతను కోల్పోయేలా ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు అసెంబ్లీకి రావచ్చు కదా? అని ప్రశ్నించారు. అమరావతి భూముల పరిరక్షణ పాదయాత్ర ఎందుకో అర్థం కావడం లేదన్నారు. మీరెన్ని పాదయాత్రలు చేసినా వికేంద్రీకరణే తమ లక్ష్యమని స్పష్టంచేశారు.

'పద్మ' నామినేషన్లకు నేడు తుదిగడువు

న్యూఢిల్లీ: పద్మ అవార్డుల నామినేషన్ల గడువు గురువారంతో ముగియనుంది. నామినేషన్లు, సిఫార్సుల కోసం మే 1 నుంచి సెప్టెంబరు 15 వరకు కేంద్ర హోంశాఖ గడువునిచ్చింది. ప్రతిఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డులను ప్రకటించడం ఆనవాయితీ. 1954 నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. పద్మ అవార్డులు–2023 కోసం ఆన్‌లైన్ నామినేషన్లు, సిఫార్సులు పంపేందుకు గడువు గురువారంతో ముగుస్తున్నదని కేంద్ర హోంశాఖ బుధవారం ప్రకటించింది. పద్మ అవార్డుల నామినేషన్లు, సిఫార్సులను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో మాత్రమే స్వీకరిస్తారు. దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మ అవార్డులలో పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ శ్రేణులు ఉన్నాయి. ఈ అవార్డులను కళ, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సంఘసేవ, సైన్స్, ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌర సేవ వంటి అన్ని రంగాలలో అసాధరణ సేవలు అందించిన వారికి అందిస్తారు. వైద్యులు, శాస్త్రవేత్తలు మినహా ప్రభుత్వరంగ సంస్థల (పీఎస్‌యూ)లో పని చేసేవారు, ప్రభుత్వ అధికారులు ఈ అవార్డులకు అర్హులు కాబోరు. పద్మ అవార్డులను 'పీపుల్స్ పద్మ'గా మార్చే కసరత్తులో మోదీ ప్రభుత్వం ఉన్నట్లు ఓ అధికారి తెలిపారు. మహిళలు, సమాజంలోని బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులు, సమాజానికి నిస్వార్థ సేవ చేస్తున్న వ్యక్తులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. సంబంధించిన వివరాలు 'అవార్డ్స్ అండ్ మెడల్స్' శీర్షిక కింద హోం మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్, పద్మ అవార్డ్స్ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి.

సినీ కార్మికులకు వేతనాల పెంపునకు నిర్మాతల మండలి అంగీకారం

హైదరాబాద్: మూడేళ్లుగా వేతనాలు పెంపు కోసం పోరాడుతున్న సినీ కార్మికుల డిమాండ్లపై తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సానుకూలత వ్యక్తం చేసింది. కార్మికులు కోరుతున్న 30 శాతం వేతనాలను పెంచేందుకు నిర్మాతల మండలి అంగీకరించింది. ఈ మేరకు ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులతో జరిగిన చర్చలు సఫలం కావడంతో నిర్మాతలు ఊపిరిపీల్చుకున్నారు. 30 శాతం వేతనాలు పెంచాలనే డిమాండ్‌తో కార్మికులు గతంలో చిత్రీకరణలను నిలిపివేసి ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ప్రతి మూడేళ్లకోసారి వేతనాలు పెంచాల్సి ఉండగా కరోనా కారణంగా నిర్మాతలు జాప్యం చేస్తూ వచ్చారని, ఈ సారి వేతనాలు సవరించి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఫిల్మ్ ఫెడరేషన్ మరోసారి పట్టుపట్టింది. తమ డిమాండ్‌ను నెరవేర్చకపోతే ఈనెల 16 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించింది. దీంతో నిర్మాతల మండలి.. వేతన కమిటీ ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకొని కార్మికుల వేతనాలను 30 శాతం విడతల వారీగా పెంచాలని నిర్ణయించింది. ఈ విషయంపై గురువారం అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

'గాలి' కేసులో విచారణ ఎందుకు జరగదు?: సుప్రీం

న్యూఢిల్లీ: అక్రమంగా గనుల తవ్వకాలకు సంబంధించి గాలి జనార్దన్‌రెడ్డిపై సీబీఐ నమోదు చేసిన కేసుపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. కేసు నమోదై 12ఏళ్లయినా జడ్జి ఎదుట విచారణ సాగకపోవడంపై సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. తీవ్ర అభియోగాలున్న కేసులో విచారణ సాగకపోవడం సరికాదని పేర్కొంది. ఇలా చేయడం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని వ్యాఖ్యానించింది. ట్రయల్ కోర్టులో కేసుల విచారణ ఏ దశలో ఉందో తెలపాలని ఆదేశించింది. విచారణ ఆలస్యంపై ఈనెల 19వ తేదీలోపు సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ సీబీఐ కేసుల కోర్టు ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జికి ఆదేశాలు జారీ చేసింది. మరో వైపు బెయిల్ షరతులు సడలించాలని 2020లో గాలి జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్‌ను తిరస్కరించాలని సీబీఐ తరఫు న్యాయవాది కోరారు. బెయిల్ షరతులు సడలిస్తే విచారణపై ప్రభావం పడుతుందని కోర్టు దృష్టికి తెచ్చారు. సాక్షులను ప్రభావితం చేస్తారని, వారి ప్రాణాలకు ముప్పు ఉందని సీబీఐ తెలిపింది. కేసు విచారణ పురోగతి తెలిశాక పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. సీబీఐ కూడా వివరాలు తెలుసుకుని రావాలని తెలిపింది.

అమరావతి-అరసవిల్లి యాత్ర రాజకీయం

ఎమ్మెల్యే పార్థసారథి ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకే అమరావతి–అరసవిల్లి యాత్ర రాజకీయంగా మారిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి విమర్శించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రావాలని, రాష్ట్రాభివృద్ధిపై చర్చిద్దామని సవాల్ విసిరారు. మూడేళ్లలోనే 95 శాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని, దేశంలో ఎక్కడా, ఏ నేతా అలా పని చేయలేదన్నారు. జగన్ పాలన చూసిన తర్వాత టీడీపీకి, ఆ పార్టీ అధినేతకు దిక్కు తోచడం లేదని, ఈ ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న మేలు చూసి, తనకు రాజకీయ సమాధి తప్పదన్న భయంతో చంద్రబాబు విద్వేషపూరిత రాజకీయాలకు పురి కొల్పుతున్నారని మండిపడ్డారు. కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ఇది కేవలం చంద్రబాబు స్వార్థం కోసం ప్లాన్ చేసిన రాజధాని అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.